ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 25.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 9 జూలై 2025



హైస్పీడ్ హైవే

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుపై దూసుకుపోనున్న వాహనాలు

డిజిటల్ హైవే ప్రతిపాదనలు

విశాఖ-హైదరాబాద్ మధ్య తగ్గనున్న125 కిలోమీటర్లు



గుట్కా, ఖైనీ విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు

మహిళ దారుణ హత్య

భార్యను వివాహేతర సంబంధానికి ప్రోత్సహిస్తోందని ఘాతుకం

ఇరవై ఏళ్ల క్రితం అదృశ్యమై.. ఇప్పుడు కనిపించాడు

అవాక్కైన కుటుంబ సభ్యులు, బంధువులు

ఒత్తిడితో పని చేయలేం..

మూకుమ్మడి సెలవులు పెడతాం

ఉపాధ్యాయుల ఆవేదన

లోపలి పేజీల్లో..

ఇసుక నిల్వలు సిద్ధం

జిల్లాలో 5 స్టాక్ పాయింట్లు

1,39,945 మెట్రిక్ టన్నుల నిల్వ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వర్షాకాలం ఇసుక కొరత లేకుండా స్టాక్ పాయింట్ల వద్ద మొత్తం 1,39,945 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేశారు. భూగర్భ, గనుల శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్, మే నుంచి జిల్లాలోని స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక నిల్వ చేశారు. పొరుగు జిల్లా తాడిపూడి ఇసుక ర్యాంప్ నుంచి జిల్లాకు కేటాయింపు మేరకు ఐదు స్టాక్ పాయిం ట్లకు తరలించారు. కూటమి ప్రభుత్వం ఇసుక పాలసీలో సమూల మార్పులు చేయడంతో సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. వర్షాకాలం ఇసుక కొరత ఉండదని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఐదు స్టాక్ పాయింట్లు

ఏలూరు జిల్లాలో పోలవరం, దెందులూరు నియోజకవర్గాలకు సమీపంలోనే ఇసుక నిల్వలు లభిస్తుండడంతో వీటిని మినహాయించి ఐదు చోట్ల ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచనలతో ఇసుక రవాణాకు టెండర్లు ఆహ్వానించారు. చింతలపూడి నియోజకవర్గానికి షన్వీ కన్‌స్ట్రక్షన్స్, ఉంగుటూ రుకు కేవీవీఎస్‌ఎన్ ఎస్టేట్స్, ఏలూరు నియోజక వర్గానికి చొదిమెళ్ల వద్ద స్టాక్ పాయింట్‌ను బీఆర్‌సీ కన్‌స్ట్రక్షన్స్, కైకలూరు(చావలిపాడు), నూజివీడు(మీర్జాపురం) స్టాక్ పాయిం ట్లను గోదావరి, కృష్ణా వాటర్‌వేస్ టెండర్లు దక్కించుకున్నాయి.

కైకలూరులో 9,561, చేబ్రోలు స్టాక్ పాయింట్ వద్ద 1,19,053, చింతలపూడి వద్ద 613 మెట్రిక్ టన్నులు, చొది మెళ్ల వద్ద 1023 మెట్రిక్ టన్నులు, నూజివీడుకు 9,695 మెట్రిక్ టన్నుల నిల్వలను ఉంచారు. ఉంగుటూరు వద్ద మెట్రిక్ టన్ను రూ.554, చింతలపూడి, ఏలూరుకు రూ.630, కైకలూరు, నూజి వీడుకు రూ.730 ధర జిల్లా కమిటి నిర్ధారించింది. ఇప్పుడున్న నిల్వలు రాబోయే అక్టోబరు వరకు సరిపోతుందని అంచనా వేస్తున్నారు.



ఉంగుటూరు స్టాక్ పాయింట్‌లో నిల్వ చేసిన ఇసుక

సజావుగా సార్వా



సార్వా వరి సాగు సజావుగా సాగుతోంది. పది రోజులుగా వర్షాలతో నాట్లు ముమ్మరమయ్యాయి. అంచనా మేరకు నారుమడులు పడడంతో నాట్లు జోరుగా వేస్తున్నారు. వర్షాలతో సాగుకు సరిపడా నీరు అందడం, గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని కాలువల్లో సమృద్ధి నీటితో రైతులు హుషారుగా పనులు చేపట్టారు.

- జిల్లాలో జోరందుకున్న వరి సాగు
- వర్షాలతో నారుమడులు, నాట్లు
- 55.32 శాతం నారుమడులు పూర్తి
- 3.75 శాతం నాట్లు

ఏలూరు సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి):జిల్లాలో సార్వా సజావుగా సాగుతోంది. ఉంగుటూరు, నిడమర్రు, దెందులూరు, భీమడోలు, పెదపాడు మండలాల్లో వరి నారుమడులు ముమ్మ రం కాగా, పెదపాడు, ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి మండలాల్లో నేరుగా విత్తే కార్యక్రమం కొనసాగు తోంది. మెట్ట ప్రాంతం, వర్షాధార భూములు, బోర్ల కింద ఆయకట్టులో వరి నారుమడులు, వరి నాట్లు వేస్తున్నారు.

6,150 ఎకరాల్లో వరి నారుమడులు

సార్వా సీజన్‌లో 2,22,348 ఎకరాల్లో వరి సాగు లక్ష్యం. 11,117 ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉండా 6,150 ఎకరా ల్లో 55.32 శాతం నారుమడులు పూర్తయ్యాయి. 8,360 ఎక రాల్లో నాట్లు వేశారు. పీఆర్ 126, ఎంటీయూ 1061, 1318, 5204, 7029, 112 రకాలు సాగు చేస్తున్నారు.

ఎరువుల కొరత లేదు

సార్వా సాగకు 1,18,402 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని ఖరీఫ్ ప్రణాళికలో పేర్కొన్నారు. ఇప్పటికే యూరి యా, డీఏపీ, ఎన్‌పీకే, ఎంవోపీ, ఎస్‌ఎస్‌పీ ఎరువులు 56,757 మెట్రిక్ టన్నుల వరకు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. ఏలూరు మండలంతో పాటు కామ వరపుకోట, పెదవేగి, లింగపాలెం, చింతలపూడి, టి.నరసాపు రం, జంగారెడ్డిగూడెం, కుక్కునూరు, బుట్టాయగూడెం, జీలుగు మిల్లి, కొయ్యలగూడెం, పోలవరం, ద్వారకాతిరుమల తదితర మండలాల్లో సార్వా సాగు ప్రారంభమవుతోంది

ఈ సారి ముందుగానే వరి నారుమడులు వేశారు. జూన్‌లో సాధారణం కంటె అధికంగా వర్షాలు పడడంతో ఏరువాక పౌర్ణమితో సాగు పనులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో పలు ప్రాంతాల్లో పది రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నా యి. వరి సాగు చేసే ప్రాంతాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగానే కనిపిస్తోంది. భారీ వర్షాలు కురియకపోయినా నానుడు వర్షాలు సాగుకు మేలని రైతులు చెబుతున్నారు. దుక్కిలో నీరు చేరడంతో పనులు సజావుగా సాగుతుందని చెబుతున్నారు.

పొంచి ఉన్న మరో అల్పపీడనం

మరో మూడు రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, కోస్తా ప్రాంతంలో ఎక్కువగానే వర్షాలు కురు స్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. జోరుగా వర్షాలు కురిస్తే జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సార్వా సాగు పనులు మరింత ఉపందుకుంటాయని చెబుతున్నారు.

ఇతర పంటల జోరు

వరితో పాటు ఇతర పంటల సాగు కూడా ముమ్మరంగా సాగుతోంది. అపరాలు, కూరగాయలు, మిరప సాగు పనులు జోరందుకున్నాయి. సకాలంలో వర్షాల వల్ల దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయని భావిస్తున్నారు.

నేడు సమ్మె

కార్మిక సంఘాలు సమాయత్తం

ఏలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకి స్తూ కార్మిక సంఘాలు బుధవారం సమ్మె కు పిలుపునిచ్చాయి. కార్మిక, కర్షక, బ్యాంకింగ్ తదితర రంగాలు బుధవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పాల్గొంటున్నాయి. ప్రధానంగా బ్యాంకింగ్, ఎల్‌ఐసీ తదితర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులతోపాటు అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన వర్కర్లు, మునిసిపల్ కాంట్రాక్టు కార్మికులు మురా, భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు సమ్మె చేపడుతున్నారు. వారికి విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించా యి. సీఐటీయూ, ఏఐటీయూసీ ఇతర అనుబంధ సంఘాల కార్మికులంతా ఏలూ రులో పవర్‌పేట నుంచి ఆర్‌ఆర్ పేట వేంకటేశ్వరస్వామి గుడి వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రధానంగా నాలుగు కార్మిక బోర్డులను రద్దు చేయాల ని, ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, 2020లో విద్యుత్ సంస్కర ణల బిల్లును ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్లను కార్మికులు, కర్షకులు వినిపించనున్నారు.

రైతు కూలీలు సైతం

పంటలకు మద్దతు, ధరల చట్టాన్ని తీసుకురావాలని, రైతులు, వ్యవసాయ, కార్మికులు, కౌలు రైతుల రుణాలు రద్దు చేయాలని కోరతూ రైతు కూలీలు, కార్మికులు సమ్మెలో పాల్గొననున్నారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా పిలుపునిచ్చారు.

10లోగా పోషణ్ యాప్‌లో ఈకేవైసీ నమోదు చేయాలి

ఏలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పోషణ్ ట్రాకర్‌లో లబ్ధిదారు ల ఈకేవైసీ, ఫేస్ అథెంటిఫికేషన్ ప్రక్రి యను ఈ ఈ నెల 10లోపు పూర్తి చేయా లని కలెక్టర్ కె.వెట్రిసెల్వి, సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లను ఆదేశించా రు. సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించా రు. అంగన్‌వాడీ పిల్లల సంరక్షణలో భా గంగా పోషణ్ ట్రాకర్‌లో ఈకేవైసీ నమో దు, ముఖ గుర్తింపు నమోదు తప్పనిసరి అన్నారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులకు టేక్‌హోమ్ రేషన్ పంపిణీ మొదటి దశను ఈ నెల 15లోపు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ పి.శారద, సీడీపీవోలు పాల్గొన్నారు.



అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావుకు బొకే ఇస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

వాణిజ్య పన్నుల శాఖ ఏసీగా శ్రీనివాసరావు

ఏలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ ఏలూరు-2 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్‌గా బి.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏసీ రమాదేవి విజ యవాడ బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావు ఇక్కడ చేరారు. ఆయనకు ఏపీ సిటీ సర్వీస్ అసోసియేషన్ ఉపా ధ్యక్షుడు కె.చిట్టిబాబు, జాయింట్ సెక్రటరీ కె.కిశోర్, ఏపీజీఈఏ జిల్లా జాయింట్ సెక్ర టరీ జి.జాన్‌బాబు, ప్రసాద్‌బాబు శుభా కాంక్షలు తెలిపారు.

రేపు బాధ్యతలు చేపట్టనున్న జిల్లా వైద్యాధికారి అమృతం

ఏలూరు అర్బన్, జూలై 8(ఆంధ్ర జ్యోతి):ఇటీవల బదిలీపై నియమితులైన జిల్లా వైద్యాధికారి పి.జాన్ అమృతం గురువారం బాధ్యతలు చేపడతారు. ప్రస్తుత డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని గుంటూరు నగరపాలక సంస్థ మెడికల్ అండ్ హెల్తాఫీసర్‌గా బదిలీ అయ్యారు.

సొసైటీలకు త్రిసభ్య కమిటీలు

- తొలి విడత 34 సహకార సంఘాలకే నియామకం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఎట్టకేలకు కొన్ని సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 158 సొసైటీలు ఉండగా కేవలం 34 సొసైటీలకే త్రిసభ్య కమిటీలను నియమిస్తూ తొలి విడత జాబితా విడుదల చేశారు. కొద్ది రోజుల వ్యవధిలో మలివిడత జాబితా రానుంది. చాలా కాలంగా సొసైటీలకు త్రిసభ్య కమిటీలు పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైన తరుణంలో నామినేటెడ్ కమిటీలను ప్రకటించారు. ఈ కమిటీలు వచ్చే ఏడాది అక్టోబరు వరకు పదవిలో ఉంటాయని, తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు ఇవే కొనసాగుతాయని ప్రకటించారు. తొలి విడత జాబితాలో కొన్ని నియోజకవర్గాలకు ప్రాతినిధ్యమే దక్కలేదు. దెందులూరు, ఉంగుటూరు వంటి నియోజకవర్గాలకు అత్యధిక ప్రాధాన్యత లభించింది. కమిటీలు ప్రకటించిన సొసైటీలు ఇవే..

సొసైటీ	చైర్‌పర్సన్	సభ్యులు
దెందులూరు	గారపాటి కొండయ్యచౌదరి	కె.వెంకటేశ్వరరావు, ఎం.వెంకటరత్నం
గంగన్నగూడెం	కూచిపూడి వెంకటకిశోర్	ఎం.సత్యనారాయణ, సీహెచ్. అచ్చమ్మ
కొవ్వలి	వెలమాటి అనీల్‌కుమార్	ఎస్.మహేష్‌బాబు, బీద బుజ్జి
పోతునూరు	బొడ్డేటి మోహన్‌బాబు	జి.విజయకుమార్, చల్లా బాలస్వామి
సీతంపేట	వై.సత్యనారాయణ	ఎస్.గంగాభవాని, బి.రామచంద్రరావు
సోమవరప్పాడు	బన్నే శ్రీనివాసరావు	డి.నాగరాజు, కె.శ్రీనివాసచౌదరి
చాటపర్రు	కలారి శ్రీనివాసచౌదరి	వి.అప్పారావు, ఎ.సువర్ణరాజు
జాలిపూడి	ఎం.హరిచంద్రకుమార్	కె.శివరామకృష్ణ, ఎన్.రమేష్
చిననింద్రకొలను	పాతూరి నరసింహరాజు	ఎస్.రంగారావు, బి.నాగబాబు
కొప్పాక	కెవివి వరప్రసాద్	పి.వీరాస్వామి, జి.యేసుపాదం
పెదవేగి	తాతా సత్యనారాయణ	కొమ్మిన సతీష్, పి.రాటాలు
బాదంపూడి	వల్లభనేని గణపతి	జె.శ్రీనివాసరావు, ఎ.సత్యనారాయణ
బొమ్మిడి	మైలారపు గోపాలకృష్ణ	ఎన్.ఆనందరావు, కె.శ్రీనివాసరావు
చేబ్రోలు	కడియాల రవిశంకర్	వి.దుర్గారావు, జి.బాలభాస్కర్
వడలి	అణగాని గంగాధరరావు	ఎం.గంగరాజు, ఎం.సత్యనారాయణ
వాడపల్లి	ఎం.గోవర్ధనరావు	పి.శ్రీహరి, పి.సాయిరాం
చేపూరు	పాతూరి కస్తూరిబాయి	జి.మోహన్‌రావు, జి.భాస్కరరావు
గోకినంపాడు	వెనిగళ్ల సురేష్	ఎం.సూరిబాబు, ఎన్.సీతారామయ్య
కొర్రగుంటపాలెం	తూము శ్రీనివాసరావు	ఎన్.రామకృష్ణ, ఎస్.సత్యనారాయణ
బొమ్మినంపాడు	కె.లక్ష్మీచింత రంజన్‌దాస్	వై.రాజేంద్రప్రసాద్, బి.సుందరరామయ్య
ఉప్పరగూడెం	గునుపూడి నాగరాజు	కె.శ్యాంసుందరరావు, వి.సుబ్బారావు
వైవాక	వీరంకి వెంకట అప్పయ్య	ఎన్.వీరరాఘవులు, టి.ప్రభాకర్
పెదపాలపర్రు	బొప్పన లక్ష్మీనరసింహారావు	ఎ.కుసుమకుమార్, పి.వి.ఎస్.వరప్రసాద్
వింజరం	బండి రాధాకృష్ణ	జి.నాగరాజు, పి.నాగమల్లేశ్వరరావు
వేమవరప్పాడు	నున్నా వెంకటేశ్వరరావు	ఎస్.రవీంద్రబాబు, టి.థామస్
గోపవరం	అల్లూరి రాజేష్‌కుమార్	ప్రసాద్, ఎ.సత్యనారాయణ
కానుకొల్లు	కోసూరి మాణిక్యాలరావు	ఎ.సూర్యప్రసాద్, ఇబ్రహీంఖాన్
ఉనికిలి	నిమ్మగడ్డ విశ్వేశ్వరరావు	జి.మల్లేశ్వరరావు, టీవీశ్రీనివాసరావు
సింగనపూడి	సూర అక్కారావు	డి.శ్యాంసన్, ఎన్.మురళీమోహన్
పెనుమాకలంక	సైదు సత్యనారాయణ	బి.అంతర్వేది, ఎస్.నాగేశ్వరరావు
మొకసకలవపూడి	అల్లూరి వెంకటేశ్వరరావు	కె.శ్రీనివాసరావు, వి.శివనాగేశ్వరరావు
పెరికిగూడెం	పి.ఆదినారాయణ	సి.శ్రీరాములు, ఎ.నాగరాజు
తక్కెళ్లపూడి	బొల్లవరపు రవి	కె.జోసఫ్ తంబి, ఆర్.జయరాజు
పులపర్రు	భలే ఏడుకొండలు	జి.బుషిరాజు, ఎం.కాకరాజు

వరద హెచ్చరిక

ముందస్తు చర్యలపై కలెక్టర్ సమీక్ష

- నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- తాటుకూరుగొమ్ము వద్ద గోదావరి ఉధృతి పరిశీలించిన కలెక్టర్ వెట్రిసెల్వి
- అధికారులతో సమీక్ష
- తక్షణ చర్యలపై సూచనలు
- సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రజలకు సూచన





తాటుకూరుగొమ్ము వద్ద గోదావరిని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, సమీక్ష సమావేశంలో జేసీ ధాత్రిరెడ్డి

వేలేరుపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద వచ్చే అవకాశం ఉందని, నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. వేలేరుపాడు మండలం తాటుకూరుగొమ్ము వద్ద గోదావరి వరద ప్రవాహాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. ముఖ్యంగా రైతులు, ప్రజలు పశువుల కాపరులు చేపలు పట్టేవారు నదిలోకి దిగవద్దని సూచించారు. తాటుకూరు గొమ్ము గ్రామస్థులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఎంవీ.రమణ, తహసీల్దార్ డీవీ.సత్యనారాయణ,

ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయండి

ప్రస్తుత వర్షాకాలంలో తుఫాన్, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో తహసీల్దార్ కార్యాలయంలో వరదలకు చేపట్టాల్సిన చర్యలపై ముందస్తు ప్రణాళిక సమావేశం నిర్వహించారు. రానున్న మూడురోజుల్లో భద్రాచలం నుంచి గోదావరి వరద నీరు 9 లక్షల క్యూసెక్కులకు పైగా దిగువకు వచ్చే అవకాశం ఉందని, పెదవాగు, ఎద్దువాగుల నుంచి వేలేరుపాడు, కుక్కునూరు మండ లాలకు వరద ముప్పు పొంచి ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతా లకు తరలించేందుకు అధికారులు సమాయత్తం కావాల న్నారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక 43అడుగులకు చేరుకోక ముందే అధికారులు సహాయ చర్యలకు సిద్ధం కావాలని, ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టా లు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ముంపు ప్రమాద ప్రాంతాల్లోని గర్భిణులు, పిల్ల లు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు,

మిగతా 8వ పేజీలో..

పునరావాస కేంద్రం పరిశీలన

కుక్కునూరు: గోదావరి వరద దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంత ప్రజలను ముందుగా పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశిం చారు. దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీని పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణ శాఖాధికారులు మంగళవారం పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదు పాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.



కలిదిండిలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు, నేతలు

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి కొల్లు రవీంద్ర

కలిదిండి, జూలై 8(ఆంధ్రజ్యోతి):పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్య మని ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కలిదిండిలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి ఏడాది లో అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మండలంలో గుంతల రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, వీరమల్లు నరసింహారావు, కొత్తా నాగేంద్ర కుమార్, తాడినాడ బాబు, పోకల జోగిరాజు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు రీ కౌన్సెలింగ్ చేపట్టండి

- సచివాలయ ఉద్యోగుల డిమాండ్



వినతులు ఇచ్చేందుకు వచ్చిన ఉద్యోగులు

ఏలూరు రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో పారదర్శకత లేదని, రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. బదిలీ తీరుపై సంక్షేమ, విద్యా సహాయకులు ఆందో ళన చేపట్టడంతో అభ్యంతరాలు పరిశీలించా లని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశిం చారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్‌రెడ్డి మంగళ వారం వినతులు స్వీకరించారు. తాము ఇచ్చి న ఆప్షన్ కాకుండా సుదీర్ఘ ప్రాంతాలు, ఇతర మండలాల్లో పోస్టింగ్ ఇవ్వడం, ఒకేచోట ఇద్దరికి పోస్టింగ్ ఇవ్వడంపై సచివాలయ ఉద్యోగులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అధికారులు మాత్రం కోరుతున్న స్థానాలు లిఖితపూర్వకంగా ఇవ్వాలని చెబుతున్నారని, తాము కోరిన స్థానాల్లో ఇప్పటికే చాలా మంది విధుల్లో చేరారన్నారు. 646 మందిలో 606 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారని, మిగిలిన 40 పోస్టు లకు మాత్రమే విజ్ఞప్తులు స్వీకరిస్తున్నారని మండిపడుతున్నారు. రీ కౌన్సెలింగ్ నిర్వహిం చాలని కోరుతుంటే మభ్యపెట్టేలా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 5 ప్రకారం సీనియారిటీ జాబితా, ఖాళీ లను వెల్లడించి, ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు, ప్రాధాన్య కేటగిరి, విజ్ఞప్తుల జాబితా వంటి వివరాలను ముం దస్తు ప్రకటించాల్సి ఉందన్నారు.

డీసీఎంఎస్‌కు కొత్త రూపం



కూటమి ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి

త్వరలో సమిశ్రగూడెం వద్ద రైస్‌మిల్లు, ఆక్వా ఎరువుల ఫ్యాక్టరీ

జిల్లా వ్యాప్తంగా పది కొత్త అవుట్‌లెట్‌లు

ఆంధ్రజ్యోతితో డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీ

నరసాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలందించాల్సిన వ్యవస్థలన్నీ గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమయ్యాయి. సహకార స్ఫూర్తి తప్పటడుగులు వేసింది. రైతులకు, ఇతర వర్గాలకు అందుబాటులో ఉండాల్సిన డీసీఎంఎస్ లాంటి సహకార రంగాలు అలంకరణ ప్రాయంగా మిగిలాయి, కనీసం ఐదేళ్లల్లో ఒక్క అవుట్‌లెట్ కూడా ఏర్పాటు చేయలేదు. రైతులకు సొసైటీ ద్వారా అందించాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగులు మందులు వంటివి దొడ్డిదారిన, అయినవారికి అందాయన్న ఆరోపణలు లేక పోలేదు. అవినీతి ఊబిలో కూరుకుపోయిన సహకార రంగాన్ని గాడిలో పెట్టేందుకు పాలకవర్గం నడుం బిగించింది. కూటమి ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా రైతులకు సేవలందించే లక్ష్యంతో అడుగులు వేస్తున్నది. జిల్లాలో ఒకప్పుడు ఎంతో మంది రైతులకు అందుబాటులో ఉండే సహకార రంగాన్ని ఏవిధంగా ముందుకు తీసుకెళ్లనున్నారో డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు..

• ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్‌కు ఎన్ని అవుట్ లెట్లు ఉన్నాయి ?

ప్రస్తుతం 20 అవుట్‌లెట్‌లు ఉన్నాయి. కొత్తగా మరో పది ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం, తొలి అవుట్‌లెట్‌ను నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలో ఏర్పాటు చేస్తున్నాం

• ఈ అవుట్‌లెట్ల ద్వారా రైతులకు ఏమందిస్తారు?

ఎరువులు, పురుగుల మందులు, ఆక్వా రైతులకు ఫీడ్, ఆక్వా మందులతో పాటు కొత్తగా బియ్యం కూడా విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం

• అద్దె భవనాలా ? లేక స్థలం కొనుగోలు చేస్తున్నారా ?

నరసాపురం మండలంలో మాత్రం ప్రైవేట్ షాపులో ఏర్పాటు చేయబోతున్నాం. భీమవరంలో ఉన్న భవనం శిథిలమైంది. దాన్ని తొలగించి పాల్కన్ కంపెనీ సహకారంతో కొత్త భవనాన్ని నిర్మించబోతున్నాం.

• సూపర్ మార్కెట్‌ల ప్రతిపాదనలు ఏమైనా ఉన్నాయా?

డీసీఎంఎస్ ద్వారా సూపర్ మార్కెట్‌లను ఏర్పాటు చేస్తే ఆలోచన లేదు, ప్రస్తుతం కార్పోరేట్ సంస్థలు మార్కెట్‌లో పోటీ ఎక్కువగా ఉంది. ఈ తరుణంలో చిన్న చిన్న షాపులు ఏర్పాటు చేస్తే అద్దెలు కూడా రావు

• నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో ఉన్న స్థలం ఏం చేయబోతున్నారు ?

జిల్లాలో డీసీఎంఎస్‌కు నాలుగున్నర ఎకరాల స్థలం ఉంది. ప్రస్తుతం ఆక్వా ఫీడ్ తయారీ ఫ్యాక్టరీ ఉన్నా అది సరిగా లేదు. దాన్ని తొలగించి ఈ స్థలంలో నాబార్డు నిధులతో రైస్‌మిల్లుతో పాటు ఆధునిక టెక్నాలజీతో కూడా ఫీడ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తాం. ఇక్కడ తయారైన ఫీడ్‌ను అన్ని అవుట్‌లెట్స్‌కు పంపిణీ చేస్తాం.

• ప్రస్తుతం ఏడాది టర్నోవర్ ఎంత ?

ప్రస్తుతం రూ.115 కోట్లు మాత్రమే ఉంది. ఏడాదిన్నరలో ఈ టార్గెట్‌ను రూ 200 కోట్లుకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం

• ఎంత మంది పని చేస్తున్నారు?

ఉమ్మడి జిల్లాలో 200 మంది పని చేస్తున్నారు. కొత్తగా మరో 100 మందికి ఉపాధికి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం, రైస్‌మిల్లు, ఆక్వా ఫీడ్ కంపెనీల్లో 50 మంది వరకు కొత్తవారికి ఉపాధి వస్తుంది.

• కంప్యూటీకరణ ఎప్పటిలోపు ?

ఈ ఏడాది చివరిలోపు పూర్తిగా కంప్యూటీకరణ చేస్తాం. ప్రస్తుతం మాన్యువల్ విధానం ఉంది. దీనివల్ల అవినీతి జరిగేందుకు ఆస్కారం ఉంది. వీటిని అధ్యయనం చేసి పూర్తిగా కంప్యూటీకరణ చేయాలని నిర్ణయించాం.

• మామిడి రైతుల కోసం ఏం చేయబోతున్నారు ?

జిల్లాలో మామిడి రైతుల కోసం ఒక క్రషింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే ఆలోచన ఉంది. అది డెల్టా ప్రాంతంలోనే చేస్తాం. దీని వల్ల మామిడి రైతులకు ఎంతో మేలు కలుగుతుంది.

రెడ్‌క్రాస్ అవార్డులకు ముగ్గురు అధికారులు



జెడ్ వెంకటేశ్వరరావు, వేణుగోపాల్, వెంకట రమణ

భీమవరం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు జిల్లా అధి కారులు ఈనెల 9న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ అవార్డులను అందుకోనున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి వేణుగోపాల్, రిటైర్డ్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ ఉన్నారు. 2023, 2024 సంవత్సరాల్లో రెడ్‌క్రాస్ కోసం రూ.5 లక్షలకు పైగా నిధులు సమీకరించడం ద్వారా సంస్థ కార్యకలాపాలకు తోడ్పాటు అందించినందుకు వీరిని ఈ అవార్డులకు ఎంపిక చేశారు. రెడ్‌క్రాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం సందర్భంగా ఈ పురస్కారాలు అందించనున్నారు. జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షురాలు నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్, ఉపాధ్యక్షుడు టి.రాహుల్ కుమార్ రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ భద్రిరాజు, వైస్ చైర్మన్ వబిలిశెట్టి కనకరాజు, ట్రెజరర్ తిరుపతిరాజు, కమిటీ సభ్యులు వీరిని అభినందించారు.

పాలకొల్లు నుంచి ముగ్గురికి కోడి రామకృష్ణ అవార్డులు



గుడాల హరిబాబు, ముత్యాల శ్రీనివాస్, యర్రంశెట్టి వెంకటరత్నం,

పాలకొల్లు అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు దివంగత కోడి రామకృష్ణ పేరుతో పలు రంగాల్లో ప్రసిద్ధులైన వారికి ఇచ్చే అవార్డులు ఈ ఏడాదికి పాలకొల్లు పట్టణానికి చెందిన ముగ్గురికి ప్రకటించారు. నటీనట సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అందిస్తున్న సేవలకు గుడాల హరిబాబుకు యువ ప్రతిభ అవార్డు, పలు సంస్థల్లో కీలక పాత్ర పోషిస్తున్న ముత్యాల శ్రీనివాస్‌కు యువ ప్రతిభ అవార్డు, సామాజిక, సాంస్కృతిక, సాహితీ రంగాల్లో కృషి చేస్తున్న యర్రంశెట్టి వెంకటరత్నంకు సేవారత్న అవార్డు అందించనున్నట్టు ఫౌండర్ చైర్మన్ తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఆహ్వానాలు పంపారు. అవార్డులను ఈనెల 23వ తేదీ బుధవారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగే కార్యక్రమంలో అందించనున్నారు.





రోడ్డుపై కొబ్బరి కాయలు..ట్రాఫిక్ జాం

నరసాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నరసాపురం-పాలకొల్లు జాతీయ రహదారిలోని హీరోహోండా షోరూం వద్ద మంగళవారం కొబ్బరికాయల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ నుంచి కాయలు రోడ్డుపై పడిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వ్యాన్, ట్రాక్టర్ ఎదురెదురుగా వస్తున్న సమయంలో కొబ్బరికాయల లోడుపై కప్పి ఉన్న చిక్కం వ్యాన్‌కు చిక్కుకుంది. ఒక్కసారిగా ట్రాక్టర్ ట్రక్కు తిరగబడింది. దీంతో కాయలన్నీ రోడ్డుపై దొర్లాయి. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను నియంత్రించారు. వాహనదారులతో పాటు స్థానికులు రోడ్డుపై పడిన కొబ్బరి కాయలను ఏరి ట్రాక్టర్‌లో వేయడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.

హైస్పీడ్ హైవే..



జంగారెడ్డిగూడెం- చింతలపూడి మధ్య నిర్మాణంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై దూసుకుపోనున్న వాహనాలు

దేవరపల్లి నుంచి ఖమ్మం వైపు ప్రయాణం చాలంటే ఒకప్పుడు నరకప్రాయం. రోజుకు పదుల సంఖ్యలో ప్రమాదాలు. వేళ్లపై లెక్కించ తగ్గ మృతుల సంఖ్య. రోడ్ల మరమ్మతులకు ఏటా భారీగానే ఖర్చు. అయినా ఏళ్ల తరబడి సమస్య వెన్నాడుతూనే వచ్చింది. అలాంటి మార్గం ఇప్పుడు సరికొత్త రూపుదాల్చనున్నది. దాదాపు 162 కిలోమీటర్లకు పైగా గ్రీన్‌ఫీల్డ్ హైవే... గంటకు 100 కిలోమీటర్ల వేగం తగ్గకుండా వాహనాలు పరుగులు పెట్టేలా రహదారి అభివృద్ధి... చాన్నాళ్ల క్రితమే ఈ హైవే పనులు ఆరంభమైనా ఈ మధ్యనే ఒక కొలిక్కి వస్తున్నాయి. విశాఖ నుంచి హైదరాబాదు చేరేందుకు ఈ మార్గం ద్వారా 125 కిలోమీటర్ల మేర నిడివి తగ్గనుంది.

తాజాగా డిజిటల్ హైవేగా మార్చేందుకు ప్రతిపాదనలు

విశాఖ-హైదరాబాద్ మధ్య తగ్గనున్న 125 కిలోమీటర్లు

ద్విచక్ర, ఆటో, ట్రాక్టర్లకు అనుమతి నో

ఇప్పటివరకు చేసిన వ్యయం రూ.4 వేల కోట్లకు పైబడే..



దేవరపల్లి వద్ద ఇంటర్ చేంజ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఖమ్మం-దేవరపల్లి నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు ఒక కొలిక్కి వచ్చాయి. సుమారుగా 162 కిలోమీటర్లకు పైగా యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే ఇది. ఒకప్పుడున్న మార్గాన్ని పూర్తిగా మార్చి సకల సౌకర్యాలతో వేగవంతంగా ప్రయాణించేలా తీర్చిదిద్దారు. సుమారు రూ. 4 వేల కోట్లకు పైగా ఇప్పటికే ఖర్చు అయ్యింది. ఈ మార్గంలో 31 గ్రామాల్లో రెండు వేల ఎకరాలను కేంద్ర ప్రభుత్వమే సేకరించి హైవే విస్తరణకు దిగింది. హైదరాబాదు నుంచి విశాఖ వెళ్లాలంటే విజయవాడ మీదుగా 676 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వచ్చేది. గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తయితే విజయవాడ వెళ్లకుండా సమయం కలిసి రావడమే కాకుండా సుమారు 125 కిలోమీటర్ల మేర ప్రయాణ భారం తగ్గనుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ హైవేలో పాత పద్ధతు లకు పూర్తిగా స్వస్తి చెప్పారు. సుమారు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు ఈ హైవేలో ప్రయాణించేలా చర్యలు తీసు కుంటున్నారు. అందుకనే ఇక ముందు ఈ రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు వంటివి పూర్తిగా అనుమతించరు. కేవలం కార్లు, బస్సులు, లారీలు, భారీ వాహనాలకు మాత్రమే అనుమతి. ఈ మార్గం మీదుగా ఇప్పటికే విశాఖ పోర్టుకు చేరేందుకు భారీ సరుకు వాహనాలు రోజూ పెద్ద సంఖ్యలో తరలివెళ్లేవి. ఈ కారణంగా జీలుగుమిల్లి నుంచి దేవరపల్లి వరకు ఇంతకుముందున్న పాత మార్గం ఛిద్రమైంది. దీంతో ఆ మార్గంలో వెళ్లాలంటేనే అందరూ భీతిల్లిపోయేవారు. ఆఖరుకి ఆటోలు తిరగలేని దుస్థితి. గ్రీన్‌ఫీల్డ్ హైవేను ఇప్పుడు అద్భుతంగా తీర్చిదిద్దారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో మొదలై ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో ఈ హైవే ముగుస్తుంది.

ప్రయాణం సాగేదిలా..

ఈ మార్గంలో దాదాపు 11 చోట్ల హైవేలోకి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు వెసులుబాటు కల్పించారు. ప్రయాణం జరిగే పరిధిని దృష్టిలో పెట్టుకుని టోల్ వసూలు చేయబోతున్నారు. హైవేపై బయటకు వెళ్లేందుకు, హైవే మీదకు వచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు కాబట్టి ఆయా ప్రాంతాల్లోనే టోల్ బూత్‌ల ఏర్పాటుకు అవకాశాలున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించి తుది నిర్ణయానికి అనువుగా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారు. ఈ హైవేను డిజిటల్ హైవేల్లోకి చేర్చాలని ఇప్పటికే ప్రతిపాదన సిద్ధమైంది. ఇది ఆచరణలోకి వస్తే అత్యాధునిక సీసీ కెమేరాలు ఈ డిజిటల్ హైవేలో ఏర్పాటు చేస్తారు. 24 గంటలు పనిచేసేలా వీటిని అమర్చి ఆ మేరకు ఎక్కడైతే ప్రమాదం జరిగిందో , ప్రమాద వివరాలు తెలుసు కోవడమే కాకుండా రెస్క్యూ బృందాలను ఆయా ప్రాంతాలకు తరలిం చేందుకు వీలుంటుంది. నిబంధ నలకు విరుద్ధంగా రోడ్లపై ఎలాంటి ప్రయాణాలు సాగినా తక్షణం యంత్రాంగం స్పందిస్తుంది.

డిజిటల్ హైవేకు ఆస్కారం

ఈ హైవే ప్రారంభించడానికి మరికొద్ది రోజులు సమయం పడుతున్నందున తాజా ప్రతిపాదనలను అమలులోకి తెచ్చే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ జిల్లాలో తొలిసారిగా డిజిటల్ హైవేకు ఆస్కారం ఏర్పడినట్టే. ఈ హైవే యావత్తు ఖమ్మం జిల్లాలో ప్రారంభమై ఏలూరు జిల్లా చింతలపూడి మండలం సరి హద్దున ఉన్న లింగగూడెంలో మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి రేచర్ల మీదుగా టి.నర్సాపురం, ఏపిగుంట, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలం రాజవరం, యర్రం పేట మీదుగా దేవరపల్లి మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారిలో కలుస్తుంది. ఇప్పటివరకు ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ హైవేపైకి వెళ్లాలంటే రేచర్ల, గురవాయిగూడెం, దేవరపల్లిలలో మాత్రమే అనువైన ఏర్పాట్లు చేస్తున్నారు.

'బర్డ్‌ఫ్లూ' సాయమేది ?



బర్డ్‌ఫ్లూతో చనిపోయిన కోళ్లు (ఫైల్)

వైరస్ సోకి చనిపోయిన కోళ్లు

తీవ్రంగా నష్టపోయిన పౌల్ట్రీ రైతులు

సాయం కోసం ఎదురు చూపు

తణుకు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గత ఫిబ్రవరి నెలలో సంభవించిన బర్డ్‌ఫ్లూ కారణంగా లక్షలాది కోళ్లు చనిపోయాయి.. దీంతో మార్కెట్ పడిపోయింది. వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.. బర్డ్ ఫ్లూ సంఘటనతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బర్డ్‌ఫ్లూ వచ్చిన ఫారాల్లో కోళ్ళు చనిపోయి ఇబ్బందులు కొందరు ఇబ్బంది పడితే, వైరస్ సోకని ఫారాల రైతులు కూడా గుడ్లు, మాంసం మార్కెట్ లేక నష్టపోయారు. వైరస్ సోకిన సమయంలో రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. అయినా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి వెసులుబాటు కనిపించడం లేదు. ప్రభుత్వం ఆదుకుంటుందని పౌల్ట్రీ రైతులు ఎదురు చూస్తున్నారు.

రూ. వంద కోట్లు నష్టం

సుమారు ఆరు నెలలు క్రితం బర్డ్‌ఫ్లూ విపత్తు కారణంగా ఉభయ గోదావరి జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమ సుమారు రూ.100 కోట్లు నష్టం చవిచూసింది. ఇంత భారీ నష్టాన్ని భరించలేని రైతులు ప్రజాప్రతినిధులు తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. పౌల్ట్రీ రైతాంగాన్ని ఖచ్చితంగా ఆదుకుంటామని హమీ ఇచ్చారు. విపత్తు జరిగి ఆరు నెలలు గడుస్తున్నప్పటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదు. ఫారాల్లో ఆరు వారాలు దాటిన గుడ్లు పెట్టే కోళ్ళకు ఒకదానికి 140 రూపాయలు, ఇప్పటికే ఫారాల్లో ఉన్న గుడ్లకు ఒకదానికి 3 రూపాయలు, కిలో మేతకు 12 రూపాయలు ఇస్తామని ప్రకటించారు. జరిగిన నష్టంలో కొంతమేరకు అయినా ప్రభుత్వం సాయం చేస్తుందని రైతులు కొంతమేర సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఇప్పటికీ సాయం అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

కనీసం రాయితీలు కల్పించాలి

రైతులు ఎప్పటి నుంచో తమ పౌల్ట్రీ రంగాన్ని వ్యవసాయాధారిత పరిశ్రమగా గుర్తించాలని సుదీర్ఘకాలంగా విన్నవించుకుంటున్నారు. కాని ప్రభుత్వం మాత్రం రైతులు విజ్ఞప్తులను పెడచెవిన పెడుతోంది. దీంతో పరిశ్రమ రైతులు పెరుగుతున్న ఖర్చులు భరించలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యుత్‌లో రాయితీలు కల్పించాలని పెద్ద ఎత్తున రైతులు నుంచి డిమాండ్ వస్తున్నది. దానికి అనుగుణంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదు.

వడ్డీ రాయితీ కల్పించాలి



బర్డ్‌ఫ్లూ వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోయారు. వైరస్ సోకిన రైతులు ఒకరకంగా నష్టం జరిగితే, మిగిలిన రైతులు ఉత్పత్తులు, మార్కెట్ లేక నష్టపోయారు. రైతులకు ప్రభుత్వం ద్వారా బ్యాంకు రుణాలపై వడ్డీ రాయితీ కల్పించాలని కోరాం. అలాగే విద్యుత్ టారిఫ్‌లో మార్పులు చేసి న్యాయం చేయాలని కోరాం. ఇప్పటికైనా ప్రభుత్వం పౌల్ట్రీ రైతులకు న్యాయం చేయాలి.

కొమాట్లపల్లి వెంకట సుబ్బారావు, పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



ఆడమిల్లి వద్ద కుంగిన వంతెన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు,అధికారులు

కుంగిన ఆడమిల్లి వంతెన

కామవరపుకోట, జూలై 8. (ఆంధ్రజ్యోతి). ఏలూరు జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని కామవరపుకోట మండలం ఆడమిల్లి వద్దగల పాత వంతెన సోమవారం రాత్రి కుంగింది. దీంతో అధికారులు పోలీసులు యుద్ధప్రాతిపదికన అప్రమత్తమయ్యారు. రాత్రి సమయంలో ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. కొంతవరకు మోటారు సైకిళ్ళు, ఆటోలు తిరగడానికి అధికారులు అనుమతి ఇచ్చారు. పాత బ్రిడ్జి అవడం వల్ల వంతెన ఒక సైడుకు ఒరిగిందని అధికారులు నిర్ధారించారు.ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి వాహనాలను దారి మళ్లించారు. ఆటోలు, మోటారు సైకిళ్ళు, స్నవాహనాలకు మాత్రం అ నుమతించారు. జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్, తడికలపూడి ఎస్ఐ పరిశీలించారు.





ఎంఈవోతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు .. ఉప్పేరులో 90 మంది విద్యార్థులుండగా ఒక్క ఉపాధ్యాయుడే పాఠాలు చెబుతున్న దృశ్యం

ఒత్తిడితో పని చేయలేం..మూకుమ్మడి సెలవులు పెడతాం

ఎంఈవో ముందు ఆవేదన వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు

కుక్కునూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజు పాఠశాలలో విద్యార్థులకు హాజరు వేసి ఆన్‌లైన్ చేయాలి... టాయిలెట్ ఇనస్పెక్షన్ చేయాలి.. మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ చేసి ఆ ఫోటోలు కూడా అప్‌లోడ్ చేయాలి... బడికి రాని విద్యార్థులను బడికి తీసుకొచ్చేలా చేయాలి.. ఇన్ని పనులు చేస్తూ విద్యార్థులకు పాఠాలు చెప్పడం పాఠశాలలో ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు ఎలా చేస్తాడు ? ఈ ఒత్తిడి మేం భరించలేం.. మూకుమ్మడి సెలవులు పెడతామంటూ ఎంఈవో తెల్లం బాబురావు ముందు కుక్కునూరు మండల ఉపాధ్యాయుడు తమ ఆవేదన వెలిబుచ్చారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఉపాధ్యాయులల బదిలీల్లో భాగంగా 87 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ అయ్యాయి. దాదాపు 20కి పైగా పాఠశాలల్లో 60 నుంచి 100 మంది విద్యార్థులున్నారు. కానీ విధుల్లో ఉన్నది కేవలం పాఠశాలకు ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే. దీంతో 1 నుంచి 7వ తరగతి వరకు పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడే అన్ని పాఠాలు చెప్పలేక బోధన జరగని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఎంఈవో తెల్లం బాబూరావు మంగళవారం కుక్కునూరు రావడంతో దాదాపు 20 మంది ఉపాధ్యాయులు వచ్చి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. "పిల్లలకు కనీసం పాఠాలు చెప్పలేకపోతున్నాం. ఈ ఒత్తిడితో మేం పని చేయలేం...సెలవులు పెడతాం" అని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి విరుద్ధంగా అటువంటి పనులు చేయవద్దని ఈ సమస్య ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టిలో ఉందని ఎంఈవో తెలిపారు. త్వరలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్న నేపథ్యంలో సమస్య తీరుతుందని అప్పటి వరకు కాస్త వేచి ఉండాలని ఎంఈవో కోరారు.

ఒక్కో ఏఎన్ఎంకు రెండేసి బదిలీ స్థానాలు ?

మూడు రోజులుగా కొనసాగుతున్న సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-3 సచివాలయాల ఏఎన్ఎంలకు మూడురోజులుగా నిర్వహిస్తోన్న సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌లో పలు అవకతవకలు చోటుచేసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని స్థానాల కోసం ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసు లేఖల మేరకు పలువురు ఏఎన్ఎంలకు బదిలీల్లో లబ్ధి చేకూరగా, ఇదే అదనుగా వైద్య ఆరోగ్యశాఖలో నాలుగు కాసులు వెనకేసుకోవడానికి బదిలీలను మలచుకున్నట్టు సమాచారం. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ, పట్టణ ప్రాంత సచివాలయాల ఏఎన్ఎంల బదిలీల కౌన్సెలింగ్ జరుగగా, పలువురికి రెండేసి స్థానాలు కేటాయించినట్టు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా సచివాలయాల్లో వేకెన్సీల విషయంలో వైద్య ఆరోగ్యశాఖ వద్ద సరైన సమాచారం లేకపోవడమే డబుల్ ఆప్షన్ల ఖరారుకు ఓ కారణమని భావిస్తున్నారు. తాజాగా మంగళవారం మధ్యాహ్నం నుంచి ఉమ్మడి జిల్లాలోని రూరల్ ప్రాంత సచివాలయాల ఏఎన్ఎంలకు బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం కాగా, సీరియల్ నంబరు ప్రకారం ఏఎన్ఎంలను పిలవకుండా తకరారు చేయడంపై ఆయా పీహెచ్‌సీల నుంచి కౌన్సెలింగ్ పర్యవేక్షిస్తున్న కొందరు మెడికల్ ఆఫీసర్లు కూడా డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారుల తీరును ప్రశ్నించినట్టు తెలిసింది. మంగళవారం మొత్తం 402 మంది ఏఎన్ఎంలకు బదిలీ కౌన్సెలింగ్ జరగాల్సి ఉండగా, రాత్రి 9 గంటల సమయానికి కేవలం 200 మంది వరకు మాత్రమే పూర్తయినట్టు సమాచారం. కాగా ఇటీవల జరిగిన రెగ్యులర్ ఏఎన్ఎంల బదిలీల విషయంలో ఆయా స్థానాలకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు పొందడానికి భారీ మొత్తాల్లోనే డబ్బులు చేతులు మారినట్టు, ఇందులో వైద్యఆరోగ్య శాఖలో కొందరు ఆర్థిక ప్రయోజనం పొందినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక ఇపుడు జరుగుతోన్న సచివాలయ ఏఎన్ఎంల బదిలీల్లో రెండేసి స్థానాలు ఖరారైనవారి విషయం కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత బయటపడుతుందని చెబుతున్నారు. బదిలీల్లో బేరసారాల విషయం జిల్లా అధికారి దృష్టికి వెళ్లినట్టు సమాచారం. కాగా సచివాలయాల ఏఎన్ఎంల బదిలీల ప్రక్రియపై తాజా సమాచారం కోసం మంగళవారం రాత్రి డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినిని ఫోన్‌లో సంప్రదించగా ఆమె స్పందించలేదు.





వేగ జ్యువెలర్స్ లక్కీడ్రా విజేతలు వీరే..

ఏలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి):ఏలూరు వేగ జ్యువెలర్స్ షోరూంలో మంగళవారం నిర్వహించిన లక్కీ డ్రాలో ఒక్కొక్కరు రూ.2 లక్షల విలువైన డైమండ్ నెక్లెస్‌లను ఐదుగురు గెలుచుకున్నారు. వీరిలో ఏలూరుకు చెందిన టి.అరుణశ్రీ, వి.రాంబాబు, గండికోట నాగలక్ష్మి, టి.శత్రుఘ్నకుమార్, హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ఎ.శారదాదేవి ఉన్నారు. విజేతలను వేగ జ్యువెలర్స్ చైర్మన్ బండ్లమూడి రామ్మోహన్, మేనేజింగ్ డైరెక్టర్ వనమా నవీన్‌కుమార్, డైరెక్టర్లు వనమా సుధాకర్, చిట్టూరి నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. చైర్మన్, డైరెక్టర్లు మాట్లాడుతూ ఖాతాదారులకు లాభం చేకూరి, వారిని సంతృప్తి పరచాలనే లక్ష్యంతోనే ఆఫర్లను అందిస్తున్నామన్నారు. పాత బంగారం మార్పిడిపై గ్రాముకు రూ.100 అదనంగా చెల్లిస్తున్నట్టు తెలిపారు. డైమండ్ ధర క్యారెట్‌కు రూ.51,999 అని తెలిపారు. ఈ ఆఫర్లు ఏలూరు షోరూమ్‌లో ఈనెల 25వరకు అందుబాటులో ఉంటాయన్నారు. వివాహ వేడుకల కోసం అన్ని రకాల ఆభరణాలను ఆఫర్లలో కొనుగోలు చేసుకోవాలని సూచించారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

కేసుల పరిష్కారానికి '90 రోజుల కార్యక్రమం'

ఏలూరు క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి):మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి 90 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్.శ్రీదేవి అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో డీఎల్ఎస్‌ఏ భవనంలో మంగళవారం ఉదయం మధ్యవర్తిత్వం వహించే న్యాయవాదులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణ వల్ల మధ్యవర్తులకు నైపుణ్యం పెంపొందించుకోవడానికి చక్కని అవకాశంగా నిలుస్తుందన్నారు. కక్షిదారులకు త్వరితగతిన పరిష్కారాన్ని అందించవచ్చని న్యాయవాదులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెరుగైన సమాజం ఏర్పడడానికి తనవంతు కృషి చేయాలని సూచించారు. రెండో అదనపు జిల్లా జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ ఇరుపార్టీలను సమన్వయం చేసి మధ్యవర్తిత్వం నిర్వహించడం ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

చింతలపూడి రిజిస్ట్రార్ కార్యాలయంలో

ఐదుగురు ఉద్యోగులకు డిప్యుటేషన్

చింతలపూడి, జూలై8(ఆంధ్రజ్యోతి):రికార్డు రూముల్లో భద్రంగా ఉండాల్సిన కాగితాలు అపహరణకు గురై ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా విచారించిన అధికారులు పర్యావసానంగా కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది పూర్తిగా డిప్యుటేషన్‌పై వెళ్లారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అంటేనే అవినీతికి రూపం. వివరాలివి.. చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక దస్తావేజు ఇండెక్స్ వాల్యూమ్‌లోని కాగితాన్ని రిజిస్ట్రేషన్ శాఖ ఐజీకి ఒకరు పంపారు. భద్రంగా ఉండాల్సిన ఈ కాగితాలు గుర్తుతెలియని వ్యక్తి ఐజీకి పంపడంపై విచారణకు ఆదేశించారు. అవినీతి ఆరోపణలు రావడంతో విచారించిన అధికారులు చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే సబ్‌రిజిస్ట్రార్ ఎస్.కె.ఎం.బేగంను విజయవాడకు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను, ఒక సీనియర్ అసిస్టెంట్‌ను ఏలూరుకు, మరొకరిని కామవరపుకోటకు డిప్యుటేషన్‌పై పంపారు. కార్యాల యంలో కాగితాలు అపహరణకు గురైనట్టు పోలీసులకు ఈ కార్యాలయం నుంచి గతంలో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. మంగళవారం ఈ ఐదుగురు రిలీవ్ అయ్యారు. ఇక్కడ మండపేట నుంచి మౌలాలి అనే అధికారిని సబ్ రిజిస్ట్రార్‌గా నియమించినట్టు తెలిసింది. మరో నలుగురిని కూడా నియమించగా ఇద్దరు మంగళవారం చార్జ్ తీసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించాల్సిన అధికారి ఇంకా బాధ్యలు తీసుకోలేదు. కాగా భద్రంగా ఉండాల్సిన కాగితాలు పోవడంతో నిర్లక్ష్యంపై స్థానికులు చర్చించుకుంటున్నారు.

'ట్రిపుల్ ఐటీలో వాజపేయి విగ్రహానికి అనుమతివ్వండి'

నూజివీడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఆర్జీయూకేటీలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహం ఏర్పాటుకు అనుమతినివ్వాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ కోరారు. ఈ మేరకు దేవానంద్ మంగళవారం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమర్నాథ్ కుమార్‌ని నూజివీడులోని ఆయన కార్యాలయంలో కలిసి డిసెంబరు 25 వాజపేయి జయంతి సందర్భంగా ఆయన విగ్రహం ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ఆటో

» నలుగురికి గాయాలు.. » పెంటపాడులో ఘటన.. నిలిచిన విద్యుత్ సరఫరా

పెంటపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాన్ని ఆటో ఢీ కొట్టిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలివి.. వరినాట్లు వేసేందుకు మండలంలోని బోడపాడు గ్రామం నుంచి తెల్లవారుజామున ఎనిమిది మంది బెంగాలి కూలీలతో ఉంగుటూరు మండలం నారాయణపురానికి ఆటో బయలుదేరింది. పెంటపాడు గ్రామం ఊరచెరువు వద్దకు చేరుకునే సరికి రహదారిపై ఉన్న లారీని తప్పిస్తుండగా ఎదురుగా మరో లారీ రావడంతో డ్రైవర్ ఆటోను పక్కకు తప్పించబోయి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. స్తంభం విరిగిపోయి ఒరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్తంభం విరిగిపోవడంతో పెంటపాడు గ్రామంలో ఉదయం నాలుగు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ ఏఈ పద్దరాజు పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేసి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు.



పెంటపాడులో విరిగిన స్తంభం వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వర్షాకాలం నివాసాల చుట్టూ ఉన్న పొదలు, చిట్టడవులలో వర్షపు నీరు చేరి విషపూరిత పాములు, కీటకాలు నివాసాల్లోకి చేరుతుంటాయి. ఇళ్లలో ఉండే ఎలుకలు, కోళ్లు, పెంపుడు పక్షుల వ్యర్థాలు, వాసనలకు ఆకర్షితమై ఆహారం కోసం నివాసాల్లోకి చొరబడతాయి. ఇళ్లల్లో, ఇంటి ఆవరణలో విద్యుత్ దీపాల వద్దకు వచ్చే పురుగుల కోసం వచ్చే కప్పలు, తొండలు, బల్లుల వంటి ఆహారాల కోసం వెతుక్కుంటూ వస్తుంటాయి. ఆ సమయంలో మనుషులను కాటు వేస్తే ముప్పు తప్పదు. పంట పొలాల్లో నిత్యం కాయకష్టం చేసుకునే రైతులకు, వ్యవసాయ కూలీలకు పాముల నుంచి తరచూ ముప్పు వాటిల్లుతుంది. పాముకాటు మరణాలు విషప్రభావం కంటే భయాందోళనలకు గురవడం వల్లే సంభవిస్తుంటాయి. పాముకాటు ప్రమాద నివారణ కోసం ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. పాము కాట్లు, ప్రమాద లక్షణాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

పోలవరం/ఏలూరు క్రైం జూలై 8 (ఆంధ్రజ్యోతి):



బుస్.. బుస్..

వర్షాకాలంలో విషపూరిత పాములతో తస్మాత్ జాగ్రత్త



విషపూరిత పాములు వాటి లాలాజల గ్రంథులలో విషం ఉంటుంది. ఈ విషం వాటి దవడలలో పైరెండు వంపు తిరిగిన సూదైన కోరలలో ఉంటుంది. కాటు వేసినప్పుడు దవడలు నొక్కబడి కోరలలో విషం శరీరంలోకి ఇంజెక్షన్‌లా చొచ్చుకుపోయి రక్తంలో కలుస్తుంది. ప్రపంచంలో ఉన్న అన్ని పాముల జాతులలో విషపూరితమైన జాతులు మూడు 1. కట్లపాము, 2. పింజరి (పొడపాము) 3. తాచుపాము ఇవి మూడు ప్రమాదకరమైన విషాన్ని కలిగి ప్రాణ నష్టాన్ని కలుగజేస్తాయి.

ఏలూరు జిల్లాలో నెలకు 50 నుంచి 60 మంది పాముకాటు బారిన పడుతున్నారు. వీటిలో 20 వరకు రక్త పరీక్షలు చేసిన తరువాతే వైద్యులు ఆ రక్తంలో ఉన్న విషాన్ని బట్టి వైద్యాన్ని అందిస్తున్నారు. మరికొంతమంది ఏమి కాటు వేసిందో తెలియదని ఆసు పత్రులకు వస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో నెలకు 20 మంది వరకు పాముకాటు బాధితులు వస్తూనే ఉన్నారు. వీరంతా వైద్యం పొంది ఆరోగ్యంగానే వెళ్తున్నారు.

పాముకాటు లక్షణాలు..

చర్మంపై కాటు గుర్తులు ఇవి స్పష్టమైన పంక్చర్ గాయాలు లేదా దాదాపు కనిపించని చిన్న గీతలు కావచ్చు. కాటు నుంచి వాపు, గాయాలు లేదా రక్తస్రావం, కాటు చుట్టూ తీవ్రమైన నొప్పి ఉంటుంది. నొప్పి తీవ్రత పెరగడా నికి సమయం పడుతుంది. కాలు బరువెక్కడం నుంచి లక్షణాలు మొదలవుతాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండె కొట్టుకునే వేగం హెచ్చుతగ్గులు, వికారం, వాంతులు లేదా తలనొప్పి, తలతిరగడం, కళ్లు మసకబారడం, కండరాల బలహీనత, పక్షవాతం లక్షణాలు కనిపిస్తాయి.

ప్రథమ చికిత్స ఇలా..

పాముకాటుకు గురైన వెంటనే 112కి గానీ 108,104 వాహనాలకు గానీ అత్యవసర నంబర్లకు సమాచారం ఇవ్వాలి. కాటుకి గురైన వ్యక్తిని కదలకుండా ఉంచి వారిని ఆందోళన చెందకుండా ధైర్యం చెప్పాలి. కాటు వేసిన ప్రాంతానికి ఎగువన ప్రెజర్ బ్యాండేజి వేయాలి. శ్వాస తీసుకోవడం కష్టమైతే కార్డియోపల్మోనరీ (సీపీఆర్) ప్రారంభించండి. కాటు వేసిన ప్రాంతాన్ని కడగడం చేయకూడదు. దుస్తులపై మిగిలిన విషం పాము ఏజాతితో గుర్తించడానికి సహాయపడుతుంది. గాయాన్ని కత్తిరించడం, గాట్లు పెట్టడం, నోటితో పీల్చడం చేయకూడదు.

- పాముకాటుకి గురైన ప్రతి వంద మందిలో ఐదుగురికి యాంటీ స్నేక్ వ్యాక్సిన్ ఇవ్వబడుతుంది. ఇది పాము విషం మనిషి రక్తంలో పనిచేయకుండా ఆపుతుంది. యాంటీ వీనమ్ రక్తప్రవాహంలోకి ఇంజెక్ట్ చేయబడుతుంది. కాటు వేసిన పాము రకం, లక్షణాలను బట్టి యాంటీ స్నేక్ వ్యాక్సిన్ ఇంజక్షన్‌లు పాముల రకం బట్టి డోసు ఉంటుంది.

సొంత వైద్యం వద్దు



పాము కాటు వేసినప్పుడు నాటు మందులు, మంత్రాలు సొంత వైద్యాలు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. పాము కరిచిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించండి. ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉంటే ప్రాణహాని లేకుండా ఉంటుంది.

- కృష్ణంరాజు ఎం.డి. వైద్యాధికారి

ఆత్మస్థైర్యం ముఖ్యం



వర్షాకాలంలో వర్షాలు వల్ల పాములు కొంత అలజడికి గురవుతాయి. అవి సురక్షితమైన ప్రదేశాలు వెళ్లే ప్రయత్నంలో ఎవరైనా దగ్గరగా వస్తే ప్రాణాలకు ప్రమాదం ఉందని భావించి కాటు వేస్తాయి. పొలాల్లో గడ్డి కోసేటప్పుడు, నడుస్తూ వెళ్లే సమయంలో పాముకాటుకు గురవుతున్నారు. కాటు వేసినప్పుడు వీలైనంత వరకు నడవకుండా వారిని పడుకోబెట్టి తీసుకురావాలి. నడవడం కాని లేదా కదపడం వల్ల రక్త ప్రసరణ జరిగి విషం పైకివెళ్లే అవకాశం ఉంది. రక్త పరీక్షల తరువాత రక్తంలో విషం ఎంత ఉందో తెలుసుకున్నాకే యాంటీ స్నేక్ వ్యాక్సిన్ డోసులను వేస్తాం. ఎంత విషం ఉన్న పాము కాటువేసినా అవసరమైన వైద్యానికి మందులు ఉన్నాయి. ఆత్మస్థైర్యం ముఖ్యం, అధైర్యపడకూడదు. పాముకాటు బారిన పడకుండా వ్యవసాయ పనుల్లో రబ్బర్ బూట్లు మోకాళ్ల వరకు ఉన్నవి ధరించడం ఉత్తమం.

- డాక్టర్ ముబీనా ఎస్ఎన్
అత్యవసర విభాగం వైద్యనిపుణులు, ప్రభుత్వాసుపత్రి, ఏలూరు

ముగ్గురు వ్యవసాయ కూలీలకు పాము కాటు

» పోలవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స

పోలవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఒకే రోజు వేర్వేరుచోట్ల ముగ్గురు వ్యవసాయ కూలీలు పాముకాటుకి గురై ఆస్పత్రిపాలైన ఘటన పోలవరం మండలంలో మంగళవారం జరిగింది. ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కృష్ణంరాజు తెలిపిన వివరాలివి.. పోలవరం మండలం చేగొండపల్లి గ్రామానికి చెందిన కట్టమూరి హరీశ్, ప్రగడపల్లికి చెందిన కుప్పాల సుబ్బారావు, కొత్తపట్టిసీమకు చెందిన రొంగల వెంకట్రావు ఉదయం పంటచేల్లో పని చేస్తుండగా పాము కాట్లకు గురయ్యారు.



చికిత్స పొందుతున్న వెంకట్రావు

బాధిత కుటుంబాల సభ్యులు వారిని పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్యకేంద్రానికి తరలించి వైద్య చికిత్స అందించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పాముకాటుకు గురైన వారి పరిస్థితి నిలకడగానే ఉందని, వారిని ఐదు రోజులపాటు పర్యవేక్షణలో ఉంచాలన్నారు.

గుట్కా గుట్టలు

» ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని దుకాణాల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ఏలూరు క్రైం/జంగారెడ్డిగూడెం/పోలవరం/ చింతలపూడి/ భీమవరం క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గుట్కా, నిషేధిత ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. 18 ఏళ్లలోపు పిల్లలకు సిగరెట్లు, మత్తుపదార్థాల అమ్మకాలు జరపరాదని ఎవరైనా విక్రయించినట్లు నిర్ధారణైతే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు హెచ్చరించారు. రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, ఈగల్ టీమ్ ఐజీ ఎ.రవికృష్ణ ఉత్తర్వులతో ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాలతో జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్‌డివిజన్ పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 'ఆపరేషన్ సేవ్ క్యాంపస్ జోన్' అనే కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. విద్యా సంస్థలకు 100 మీటర్ల దూరంలో ఉన్న షాపులను తనిఖీలు చేశారు. ఆ షాపులలో ఉన్న సిగరెట్లు, ఖైనీ, గుట్కాలు వంటి వాటిని సీజ్ చేశారు. ఏలూరు సీఆర్ఆర్ కాలేజీ సమీపంలోని ఐదు షాపులను తనిఖీలు చేయగా అక్కడ నిషిద్ధ సిగరెట్లు, మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, టూటౌన్ సీఐ ఎ.అశోక్‌కుమార్, త్రీ టౌన్ సీఐ రాంబాబు, ఆర్ఎస్ఐ ఉదయ భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ సూర్యచక్ర పలువురు పాల్గొన్నారు.



ఏలూరు సీఆర్ఆర్ డిగ్రీ కాలేజ్ సమీపంలోని ఓ షాపులో గుట్కాను పట్టుకున్న ఏఎస్పీ తదితరులు



భీమవరం వన్‌టౌన్‌లోని ఓ షాపులో తనిఖీ చేస్తున్న సీఐ

జంగారెడ్డిగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న కిరాణా, పాన్ షాపుల్లో డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత గుట్కా, సిగరెట్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని మూడు దుకాణాల యజమానులకు అపరాధ రుసుము విధించారు. తనిఖీల్లో సీఐ ఎంవి.సుభాష్, ఎస్ఐ ఎస్‌కే జబీర్, మున్సిపల్ కమిషనర్ కెవి.రమణ పాల్గొన్నారు. పోలవరం మండలం పోలవరం మెయిన్ బజార్‌లో వున్న షాపులు, జూనియర్ కళాశాల వద్ద సీఐ బాల సురేశ్ బాబు, సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. చింతలపూడిలో పాతబస్టాండ్, ఫైర్‌స్టేషన్ ఏరియాల్లో పలు సిగరెట్ల దుకాణాలపై చింతలపూడి సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు.

రూ. 25 వేలు విలువైన సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

భీమవరం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సేవ్ క్యాంపస్ కార్యక్రమాన్ని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు చేశారు. సుమారు రూ. 25 వేల విలువైన సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు, టూటౌన్ సీఐ కాళీచరణ్ వారి సిబ్బందితో షాపులలో దాడులు నిర్వహించారు.



ద్వారకాతిరుమలలో ఓ దుకాణంలో పోలీసుల తనిఖీలు

బహిరంగ ప్రదేశాల్లో స్మోకింగ్ చేస్తే శిక్షార్హులు

ద్వారకాతిరుమల : బహిరంగ ప్రదేశాల్లో, ధూమపానం నిషేధిత ప్రాంతాల్లో స్మోకింగ్ చేస్తే చట్టరీత్యా శిక్షార్హులని... పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు చట్టరీత్యా నేరమని భీమడోలు సీఐ యూజే విల్సన్ అన్నారు. ద్వారకాతిరుమల మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన సిబ్బందితో కలిసి దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. కొన్ని దుకాణాల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనపర్చుకున్నారు. అనంతరం దేవాలయ సమీపంలోనూ, బస్టాండ్ వద్ద సిగరెట్ కాల్చుతున్న వ్యక్తులకు జరిమానా విధించారు. ఏఎస్ఐ అమీర్, హెచ్‌సీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

బస్సును ఢీకొట్టి మోటారు సైక్లిస్టు మృతి

కామవరపుకోట, జూలై8(ఆంధ్రజ్యోతి): తడికలపూడి గ్రామంలోని కళ్లచెరువు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గండిగూడెంకు చెందిన గండికోట నవీన్(40) అనే వ్యక్తి మృతి చెందినట్టు తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు. మంగళవారం ఉదయం గండిగూడెం నుంచి తడికలపూడి వైపు మోటారు సైకిల్‌పై వస్తూ ముందు వెళ్తున్న ఒక ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన బస్సును క్రాస్ చేసే ప్రయత్నంలో బస్సు తగిలి రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నట్టు చెప్పారు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

కైకలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు మృతి చెందినట్టు కైకలూరు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని పెంచికలమర్రుకు చెందిన జయమంగళ గంగమ్మ(50) సోమవారం ఉదయం ఇంటి వద్ద తీగపై బట్టలు ఆరవేస్తుండగా సమీపాన ఉన్న రేకుల షెడ్డుకు ఉన్న విద్యుత్‌వైర్లు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ డి.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండలంలోని వరహాపట్నం గ్రామానికి చెందిన కత్తుల కౌశల్య(38) ఇంటిలో నిద్రపోతుండగా పాము కాటుకు గురైంది. భర్త కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్ఐ వై.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన భర్త వేధింపులు భరించలేక ఓ వివాహిత అధిక మోతాదులో మందు బిళ్లలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. పెదపాడు మండలం తోటగూడెంకు చెందిన కత్తుల సునీల్, సంధ్యారాణి దంపతులకు పదమూడేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. అతడు తాపీపనులు చేస్తుంటాడు. మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతూ, అనుమానిస్తూ కొడుతుంటాడు. గతంలో రెండుసార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించి వదిలేశారు. అతడిలో మార్పు రాలేదు. ఈ వేధింపులు భరించలేక ఆమె ఫిట్స్‌కు ఉపయోగించే మందుబిళ్లలు అధిక మోతాదులో వేసుకోవడంతో అపస్మారకస్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మహిళ దారుణ హత్య

» భార్యను వివాహేతర సంబంధానికి ప్రోత్సహిస్తోందని ఘాతుకం
» పరారీలో నిందితుడు



వరలక్ష్మీదేవి (ఫైల్)

కలిదిండి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి కల్లు గీత కత్తితో మహిళను దారుణంగా హత్య చేశాడు. పోతుమర్రు పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంకు చెందిన కట్టా రామాంజనేయులు తన భార్యను వివాహేతర సంబంధానికి ప్రోత్సహిస్తోందన్న అనుమానంతో అదే గ్రామానికి చెందిన నంగేగడ్డ వరలక్ష్మీదేవిని (38) మంగళవారం ఇంటి వద్దనే కల్లు గీత కత్తితో మెడపై నరికి హత్య చేశాడు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేయగా, కైకలూరు సీఐ రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

సారా తయారు చేస్తున్న ఇద్దరిపై పీడీ యాక్టు

» రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలింపు

ఏలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించి విచ్చలవిడిగా సారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు తరలించినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, జిల్లా సూపరింటెండెంట్ ఆవాల ఆవులయ్య తెలిపారు. పోలవరం గ్రామానికి చెందిన పజ్జూరి బాలకృష్ణ, చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంకు చెందిన ఇస్తావతు రాము 2021 సంవత్సరం నుంచి విచ్చలవిడిగా సారా తయారు చేయడమే కాకుండా పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. వీరిపై చెరో ఆరు కేసులు నమోదయ్యాయి. వీరిద్దరిపై పీడీ యాక్టు ప్రయోగించడానికి జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి గతనెల 26న ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి ముద్దాయిలపై పీడీ యాక్టు నమోదు చేసి, జైలుకు తరలించాలని ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసిందని వారు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి వారం రోజుల జైలు

» మరో ఐదుగురికి రూ.7 వేలు చొప్పున జరిమానా

ఏలూరు క్రైం : మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక వ్యక్తికి వారం రోజుల జైలు శిక్ష, మరో ఐదుగురికి జరిమానా విధించారు. ఏలూరు త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు తన సిబ్బంది కలిసి ఏలూరులో డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లా ధర్మవరం మండలం కొత్తూరుకు చెందిన కుర్రా శ్రీనివాసరావును బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేసి మద్యం తాగి వాహనం నడుపుతున్నట్టు నిర్ధారించారు. అతడిని ఏలూరులో కోర్టుకు హాజరుపర్చగా వారం రోజుల పాటు జైలు శిక్ష విధించారు. మరో ఐదుగురు మద్యం తాగి వాహనాలను నడపడంతో వారికి ఒక్కొక్కరికి రూ.ఏడు వేలు చొప్పున జరిమానా విధించారు.

ఇరవై ఏళ్ల క్రితం అదృశ్యమై..

కనిపించాడు

» అవాక్కైన కుటుంబ సభ్యులు, బంధువులు
» మరణించినట్టు ఇప్పటికే ధ్రువీకరణ పత్రం పొందిన వైనం



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న సుబ్బారావు

ఏలూరు క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్‌గా జీవించేవాడు. మద్యానికి బానిసై భార్యాభర్తల మధ్య తగాదాలు ఏర్పడడంతో భార్యను, ఇద్దరు పిల్లలను ఇరవై ఏళ్ల క్రితం వదిలివేశాడు. ఆ మద్యం మత్తులో ఎటుపోయాడో ఏమో ఆ కుటుంబానికి తెలియక తల్లడిల్లిపోయారు. బంధువుల ఇళ్ల వద్ద, పలు ప్రాంతాల్లో వెతికారు. అతడి ఆచూకీ కానరాలేదు. బతికి ఉన్నాడో చనిపోయాడో తెలియని పరిస్థితి. చివరకు ఆ తల్లి తన ఇద్దరు పిల్లలను తీసుకుని నల్లజర్ల వెళ్లిపోయి అక్కడ పిల్లలను పోషించుకుంటూ జీవించింది. సాధారణంగా అదృశ్యమైన వ్యక్తి ఏడేళ్ల వరకు కనిపించకపోతే నాట్ ట్రేస్డ్ సర్టిఫికెట్ ఇస్తారు. నిబంధనల ప్రకారమే ఆ వ్యక్తి మరణించినట్టు ధ్రువీకరణ పత్రాన్ని కుటుంబసభ్యులు పొందారు. ప్రస్తుతం ఆ వ్యక్తి ఆచూకీ లభించడంతో అందరూ అవాక్కయ్యారు.

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఆరో వార్డులో నివాసం ఉండే కలగర సుబ్బారావుకు భార్య ప్రభావతి, కుమారుడు, కుమార్తె ఉండేవారు. సుబ్బారావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ తాగుడికి బానిసయ్యాడు. భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో అతడు, భార్య, పిల్లలను వదిలివేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మద్యం తాగుతూ చివరకు లారీ డ్రైవింగ్ మానివేసి రైళ్లలో భిక్షాటన చేస్తూ, రైల్వే స్టేషన్‌లో పడుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం నిడదవోలు నుంచి భీమవరం వెళ్లే ప్యాసింజర్ రైలులో భిక్షాటన చేస్తున్న ప్రమాదవశాత్తు కాల్దారి గ్రామ సమీపంలో రైలు నుంచి జారిపడ్డాడు. అతని ఉదరభాగం కింద ఒక ఎముక విరిగినట్లు వైద్యులు గుర్తించారు. అతడిని 108లో తణుకు ఆసుపత్రిలో తీసుకువెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం మంగళవారం రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అతడి బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు అతడి వద్దకు రావడానికి నిరాకరిస్తున్నారు.

భార్య, పిల్లలను ఒకసారి చూడాలని ఉంది..

సుబ్బారావు లేవలేని పరిస్థితిలో బెడ్‌పై ఉండి అతడి మలమూత్రాలను వస్త్రాల్లోనే చేసేసుకోవడంతో ఆసుపత్రి సిబ్బంది సపర్యలు చేస్తున్నారు. తన కుటుంబసభ్యులను తన భార్య, తన పిల్లలు ఎక్కడ ఉన్నారో ఒకసారి చూడాలని ఉందని, చేసిన తప్పులకు పశ్చాత్తాపడుతున్నానని రోదిస్తూ కనిపించిన వారికి దండం పెడుతూ బతిమలాడుతున్నాడు. విరిగిన ఎముక భాగానికి ఆపరేషన్ అవసరం లేదని బెల్టు కట్టుకోవడం, మందులు వాడడం వల్ల మూడు, నాలుగు వారాల్లో తగ్గిపోతుందని వైద్యులు చెబుతున్నారు. అప్పటి వరకు అతడికి సహాయకారులు ఎవరు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది.

పదవులపై అపోహలు వద్దు: ఎమ్మెల్యే చిర్రి



జీలుగుమిల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి) : పోలవరం ఏఎంసీ, సొసైటీ చైర్మన్ పదవుల కేటాయింపుపై కూటమి నాయకులు, కార్యకర్తల్లో అపోహలు చెంద వద్దని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మంగళవారం పేర్కొన్నారు. ఇటీవల ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయని కూటమి నాయకులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఏఎంసీ, సొసైటీ చైర్మన్ పదవుల కేటాయింపుపై ఎటువంటి ప్రకటనలు వచ్చిన ఆందోళన చెందవద్దన్నారు. కూటమి నాయకుల సమావేశం అనంతరం ఏకాభిప్రాయ నిర్ణయంతో పదవుల ప్రకటన ఉంటుందన్నారు.

నాణ్యమైన రోడ్లు వేయాలి : తాడిగడప

టి.నర్సాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన రోడ్లు వేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం యూనియన్ బ్యాంకు వద్ద నుంచి విజయలక్ష్మి థియేటర్ వరకు ర్యాలీ చేసి అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. మండల కేంద్రం నుంచి బందంచర్ల వెళ్లేరోడ్డు జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నుంచి మక్కినవారిగూడెం వెళ్లే రోడ్డు, బొర్రంపాలెం రోడ్డు, శిథిలమైపోవడంతో ప్రయాణానికి ఇబ్బందికరంగా ఉందన్నారు.

జీతాల సప్లిమెంటరీ బిల్లుల గడువును పెంచాలి

ఏలూరు రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఏపీటీఎఫ్-1938 రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇ.రామ్మోహన్‌రావు, జి.మోహన్‌రావులు కోరారు. కొత్త క్యాడర్ స్ట్రెంత్‌ను రాష్ట్ర వ్యాప్తంగా వెంటనే కన్ఫామ్ చేయాలని డిమాండ్ చేశారు. వివరాలు ట్రెజరీ, సీఎఫ్ఎంఎస్ విభాగానికి చేరేలా చూడాలని కోరారు. గత నెలలో బదిలీ అయినా ఉపాధ్యాయుల వేతనాల బకాయిల సప్లమెంటరీ బిల్లులు చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీతో గడువు ముగుస్తున్నందున ఇప్పటి వరకు ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్ డీటీపీఎలకు, ఎస్‌టీవోలకు గడువును ఈ నెల 20వ తేదీ వరకు పెంచాలని డిమాండ్ చేశారు.

రూ.5 వేలు పెన్షన్ మంజూరు చేయాలి

ఏలూరు రూరల్/కార్పొరేషన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): 50 సంవత్సరాలు నిండిన వివిధ చేతి వృత్తిదారులకు నెలకు 5వేలు రూపాయల పెన్షన్ మంజూరు చేయాలని చేతి వృత్తి దారుల సమాఖ్య ఏలూరు జిల్లా కోకన్వీనర్ పి.పెంటయ్య, బీకేఎంయూ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ చేతివృత్తుల సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా నాయకులు ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావుకి వినతి పత్రం సమర్పించారు. దరఖాస్తు చేసుకున్న చేతివృత్తిదారులకు వయస్సుతో నిమిత్తం లేకుండా సబ్సిడీ రుణాలివ్వాలని కోరారు. బి.ప్రభాకర్, అరిగెల రాజు పాల్గొన్నారు.

ఉర్దూ స్కూల్‌పై యూటీఎఫ్ అత్యవసర సమావేశంలో చర్చ

ఏలూరు రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఏఆర్‌డీజీకే ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఏలూరు నగర శాఖ అత్యవసర కార్యవర్గ సమావేశం నగర అధ్యక్షులు షేక్ పర్వీన్‌బేగం అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఏలూరు జిల్లా ప్రధన కార్యదర్శి రుద్రాక్షి రవికుమార్ హాజరయ్యారు. తూర్పు వీధి ఉర్దూ పాఠశాలలో జరిగిన ఘటనపై సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల పదోన్నతులు పొందే క్రమంలో పాఠశాలను తూర్పు వీధి నగర పాలక ఉర్దూ ఉన్నత పాఠశాలగా యుడైస్ ప్రకారం మార్పు చేశారని, ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియకుండా ఎవరు ఎప్పుడు ఎలా మార్పు చేశారనే విషయాన్ని నిగ్గు తేల్చాలన్నారు. ఉర్దూ మీడియానికి సిఫార్సు చేసిన వారిని విచారించి చర్యలు తీసుకోవాలన్నారు.

మాకా ఉర్దూ స్కూల్లో టీచరు పోస్టుల భర్తీకి వినతి

ఏలూరు అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మౌలానా అబుల్‌కలాం అజాద్(మాకా) మున్సిపల్ ఉర్దూ స్కూల్లో ప్రభుత్వ నిబంధనల మేరకే హెచ్‌ఎంను పదోన్నతిపై నియమించినందున స్కూల్లో బోధనకు ఆటంకంలేకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా విద్యాశాఖదేనని ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు రామారావు, రంగావలి డిమాండ్ చేశారు. మాకా స్కూల్లో అసిస్టెంట్ కేడర్ ఉర్దూ, గణితం, ఫిజికల్ సైన్సు టీచర్ పోస్టులను భర్తీచేయాలని డీఈవో వెంకటలక్ష్మమ్మను కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కోరికమేరకు ఆంగ్ల మాధ్యమంలోనే బోధన కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సంఘ నాయకులు రామశేషుకుమార్, శ్రీనివాస్, ఆనంద కుమార్, ప్రకాశ్, తదితరులు డిమాండ్ చేశారు.

సమ్మె అగ్రిమెంట్స్ అమలు చేయాలి

ఏలూరు రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎంటీఎస్, హెచ్ఆర్ పాలసీ సమ్మె అగ్రిమెంట్స్ అమలు చేయాలని భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. జిల్లా జేఏసీ చైర్మన్ కె.వినోద్‌కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులకు ఎంటీఎస్, హెచ్ఆర్ పాలసీ, సమ్మె ఎగ్రిమెంట్స్ అమలు చేయాలని, పని భారం తగ్గించాలని ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఈపీఎఫ్, హెల్త్ కార్డులివ్వాలని, మెడికల్ లీవులు, పదవి విరమణ వయస్సు 62 ఏళ్ళకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. జిల్లా మహిళా కార్యదర్శి స్వరాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్, మణికంఠ రాజు, సతీశ్, ఫణికుమార్, బాలాజీ పాల్గొన్నారు.

పాము కాటు బాలికకు ఎమ్మెల్యే చింతమనేని పరామర్శ

ఏలూరు క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురైన బాలికకు మెరుగైన చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన పుట్టా ఈక్షిత(4) అనే బాలికను ఈ నెల 7న ప్రమాద వశాత్తు పాముకాటు వేయడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆస్పత్రికి చేరుకుని బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే చింతమనేని వైద్యులకు సూచించారు. బాలికకు ఎటువంటి ప్రమాదం లేదని అధైర్యపడాల్సిన అవసరం లేదని తాను అండగా ఉంటానని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బాలిక తల్లి దండ్రులకు, కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

జైల్లో ఉచితంగా హోమియో మాత్రల పంపిణీ

ఏలూరు క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా జైల్లో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్ సి.హెచ్.ఆర్.వి. స్వామి ఆధ్వర్యంలో డాక్టర్ అబ్బూరి అరుణ, డాక్టర్ బండారు సుదీప్తిలు ఈ శిబిరాన్ని నిర్వహించారు. వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ జ్వరాల నివారణకు ముందస్తుగా హోమియో మందులు అందించారు. 200 మంది ఖైదీలకు హోమియో మాత్రలను అందించారు. జైలర్ శ్రీనివాసరావు, వి.రమేశ్ పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం

పెదపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఆలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. అప్పారావుపేటకు చెందిన దాత నల్లిబోయిన నాగరాజు ఆర్థిక సహకారంతో సుమారు 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు.

చేపల చెరువులను ధ్వంసం చేయడం సరికాదు

ఉంగుటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కాంటూరు పేరిట జిరాయితీ భూముల్లో ఉన్న చేపల చెర్వులను ధ్వంసం చేయడంపై మాజీ ఎమ్మెల్యే ఆప్కాబ్ చైర్మెన్ గన్ని వీరాంజనేయులు ధ్వజమెత్తారు. మంగళవారం సాయింత్రం కైకరం శివారు రామన్నగూడెంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుపరిపాలను తొలి అడుగు కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ ఉపాధి కోల్పోవడం వల్ల వలసలు వెళ్ల వలసిలి వస్తుందని ఆయనకు వివరించారు.

వరద హెచ్చరిక

(5వ పేజీ తరువాయి)

విభిన్న ప్రతిభా వంతులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణులను దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

రక్షణ చర్యలు ఇలా : కోయిదా పరిసర గ్రామాల కొండ ప్రాంతాల ప్రజలకు టార్పాలిన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. గోదావరి తీర ప్రాంతంలో ముంపు గురయ్యే ప్రాంతాలను ముం దుగానే గుర్తించి ప్రమాద హెచ్చరికలు జారీ చేసిన వెంటనే ఆ ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అనువైన ప్రదేశాలను ముందుగానే గుర్తించాలన్నారు. ఆ ప్రదేశాల్లో ప్రజలను ఉంచేందుకు తాత్కాలిక షెడ్లు, తాగునీరు, టాయిలెట్లు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పాడిపశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించి దాణా, నీరందించే చర్యలు తీసు కోవాలని పశుసంవర్ధక శాఖాధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా కూలడానికి సిద్ధంగా ఉండి శిథిలా వస్థలో ఉన్న భవనాలు, బ్రిడ్జిలు, కల్వర్టులు, కాజ్‌వేలను గుర్తించి ముందుగానే మరమ్మతులు చేయించాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు. గత వరదల సమయంలో గండ్లు పడిన ప్రదేశాలను పరిశీలించి అవస రమైన చోట పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలని గతంలో జరిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని అటువంటివి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకో వాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. తుఫాన్లు, వరదల సమయంలో విద్యుత్ స్తంబాల కారణంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అలాంటి అవసరమైన చోట జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని సమాచార వ్యవస్థ పని చేసే విధంగా సెల్ టవర్లు జనరేటర్లు ఏర్పాటు చేయాలని, సోలార్‌లైట్లు సిద్ధంగా ఉంచుకోవాలని విద్యుత్ శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు కలుషితం కాకుండా ప్రస్తుత తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, తాగునీటి పైపులైన్లు, డ్రెయినేజీ పైపులైన్లు కలవకుండా చూడాలని, మరమ్మతులకు గురైన చేతి పంపులను వెంటనే మరమ్మతు చేయించాలని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత గ్రామల్లో అత్యవసర సమయంలో పంపిణీ చేసేందుకు 3నెలలకు సరిపడ నిత్యవసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర సమయాల్లో ప్రజలను తరలించేందుకు వీలుగా పెద్దసంఖ్యలో బోట్లు సిద్ధం చేసుకోవాలని మత్స్యశాఖాధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఆర్డీవో రమణ, డీఆర్‌డీఏ పీడీ కే.విజయరాజు, ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జునరావు, ఏపీవో అనురాధ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రినాథబాబు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో నాయకులు



కొయ్యలగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న బొరగం

కొయ్యలగూడెం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు.ఈ మేరకు మంగళవారం మండల కేంద్రమైన కొయ్యలగూడెం, కన్నాపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వం వచ్చాక చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ చేపట్టిన కార్యక్రమాలు వివరిస్తున్నామన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేశ్, జ్యేష్ట రామకృష్ణ, గుమ్మా గంట్లయ్య, బొబ్బర చినరాజు పాల్గొన్నారు.

● దెందులూరు : ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళవారం దెందులూరు మండలం శ్రీరామవరంలో మాజీ వైస్ ఎంపీపీ మోతుకూరి నానిబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. శ్రీరామవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నాయకులు మోతుకూరి లక్ష్మయ్యలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు, చేసిన పనులను గ్రామస్తులకు వివరించారు. ఇదే గ్రామానికి చెందిన పలు వురు వైసీపీ కార్యకర్తలు మోత్కూరి నాని ఆధ్వర్యంలో టీడీపీలో చేరగా చింతమనేని కండువా కప్పి ఆహ్వానించారు.

● ఏలూరుటూటౌన్: నియోజకవర్గంలో ఉన్న అర్హులందరికీ అక్టోబర్ నాటికి సొంత గృహాలు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 2వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి అధ్వానంగా తయారైన రోడ్లన్నిటిని బాగు చేశామన్నారు. ఇంటింటా తిరిగి సమస్యలడిగి తెలుసుకున్నారు. ఏడాదిలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలు పంపిణీ చేశారు. దాసరి ఆంజనేయులు, పెద్దిబోయిన శివప్రసాద్, పార్థసారథి, ఎస్ఎంఆర్ పెదబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం పంచాయతీ బెడదనూరు గిరిజన గ్రామంలో మంగళవారం ఏపీ ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి చేపట్టి అమలు చేస్తున్న పథకాలను వివరించారు. నాయకులు కారం సురేష్, గన్నిన సూర్యచంద్రరావు, పుసులూరి అచ్యుతరావు, చిలకమూడి సుధాకర్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చింతమనేని

● జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. మంగళవారం మండలంలోని గురవాయిగూడెంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు చిటికెన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది.గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రహదారికి అనుసంధానంగా డ్రెయిన్ నిర్మించాలని గ్రామస్థులు కోరగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి డ్రైన్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని శేషు హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు బూసా సత్యనారాయణ రెడ్డి, ఉండవల్లి చంద్రరావు, వేముల ఆంజనేయులు, గంధం అప్పాజీ, బండారు వెంకట్రావు, ఎం.హరిబాబు, కొండయ్య, శివానందం పాల్గొన్నారు.

పంటల బీమా తప్పనిసరి

పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో అవగాహన



ఉర్లగూడెంలో సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కామవరపుకోట, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పలపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పొలాలను పరిశీలించారు. మండలంలో 46 ఎకరాల్లో వరి పంట ఊడ్పులు జరిగాయని చెప్పారు. 2025సీజన్‌లో వరి, అపరాల పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పంటల బీమా పథకాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. తుఫాన్‌లు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు. ప్రతీ రైతు పంటల బీమాలో తప్పనిసరిగా ప్రీమియం చెల్లించాలన్నారు.

● పెదవేగి: సరైన యాజమాన్యం పద్ధతులే పంటల దిగుబడిని పెంచడానికి దోహదపడతాయని వ్యవసాయ శాఖ ఏలూరు సహాయ సంచాలకులు ఇ.అనిల్ కుమారి తెలిపారు. వంగూరు, జగన్నాథపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అనిల్ కుమారి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.పచ్చిరొట్ట ఎరువుల వల్ల నాణ్యమైన పంట దిగుబడి వస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి సి.హెచ్. శ్రీనివాస్, ఉద్యానశాఖాధికారి ఎం.రత్నమాల, వ్యవసాయ, సెరికల్చర్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● చింతలపూడి: రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులైతే జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని, రాని వారు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు వై.సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారి కోటగిరి మురళీకృష్ణ రైతులకు సూచించారు.మండలంలోని ఉర్లగూడెం పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ నెల 13 వరకు గ్రీవెన్స్‌లో పెట్టేందుకు గడువు ఉందని తెలియజేశారు. కౌలు కార్డు నమోదు, కౌలు రైతుల సమస్యలు తెలుసుకున్నారు. వ్యవసాయ అనుబంధ పరికరాలు, వాటి సబ్సిడీ గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో మోడల్స్ డ్రమ్ సీడర్‌తో అవలంబించే వ్యవసాయ విధానాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.



ఉప్పలపాడులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

● లింగపాలెం:మండలంలో వరి పంట వేసిన ప్రతి రైతు ఎకరాకు రూ.840 చెల్లించి పంటల బీమా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ అన్నారు. మండలంలోని నరసన్నపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, కౌలు రైతు కార్డుల వలన కలిగే లాభాలను వివరించారు. గరిమళ్ల చలపతిరావు, శాఖమూడి శ్రీనివాసరావు, పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బీమాపై రైతులకు అవగాహన

పెదవేగి : పంటలకు బీమా ఉంటే రైతు ధీమాగా ఉండవచ్చని వ్యవసాయ శాఖ ఏలూరు సహాయ సంచాలకులు అనిల్ కుమారి అన్నారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో మంగళ వారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటలకు బీమా వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా ప్రీమియం హెక్టారుకు రూ.800 ప్రీమియం చెల్లించాలని, బ్యాంకు రుణాలు తీసుకుంటే రుణం ఇచ్చే సమయంలోనే బీమా కట్టించుకుంటారని, రుణం తీసుకోని రైతులు హెక్టా రుకు రూ.800 చెల్లించి, బీమా సదుపాయం పొందాలని ఆమె తెలిపారు. పెదవేగి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, ఉద్యానశాఖాధికారిణి ఎం.రత్నమాల, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విష జ్వరాలపై అవగాహన

పెదవేగి, జూలై 8(ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ఆరంభమైన నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెదవేగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్ అన్నారు. పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంటు వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డాక్టర్ మల్లికార్జున్, సహాయ మలేరియా అధికారి జే.గోవిందరావు మాట్లాడుతూ డెంగీ నివారణకు పరసరాల పరిశుభ్రత అవసరమన్నారు. వైద్యాధికారిణి ప్రత్యూష, సీహెచ్‌వో మంగమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు రమేశ్, యామిని, సుజాత, హెల్త్ అసిస్టెంట్లు వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● లింగపాలెం: డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలని లింగపాలెం పీహెచ్‌సీ డాక్టర్ రాజశేఖర్, చింతలపూడి సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎస్.ఎ.ప్రసాద్ అన్నారు. లింగపాలెంలో మంగళవారం డెంగీ నివారణపై ప్రజలకు తెలిసేలా గ్రామంలో ప్రధాన రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అర్జునరావు, పద్మజాకుమారి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



లింగపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మేయర్ దంపతుల పూజలు



పూజలు చేస్తున్న మేయర్ దంపతులు

ఏలూరు కార్పొరేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పాత బస్టాండ్ సెంటర్‌లోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని పాండురంగస్వామి ఆలయం వద్ద జరుగుతున్న తొలి ఏకాదశి, గురుపౌర్ణమి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మేయర్ షేక్ నూర్జహాన్, కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు ఆంజనేయస్వామికి అభిషేకాలు, సింధూరార్చన నిర్వహించారు.

దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కార్మిక సంఘాలకు నాయకుల పిలుపు

పెదవేగి, జూలై8(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలంటూ ఇఫ్టూ ఆధ్వర్యంలో పెదవేగిలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. 9న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆయిల్ ఫెడ్ కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పామాయిల్ ఫ్యాక్టరీ ప్రైవేట్ పరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆయిల్‌పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ అంశాలతో కూడిన సమస్యల పరిష్కారానికి అనువుగా బుధవారం నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు.

● కొయ్యలగూడెం: దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రాంబాబు కోరారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ట్రేడ్ యూనియన్ తదితర అన్ని సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సమ్మె జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ సమ్మెకు సహకరించాలని కోరారు.

● ఏలూరు రూరల్: దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు హేలాపురి ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ మద్దతు తెలియజేసింది. యూనియన్ సర్వసభ్య సమావేశం మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో బొజ్జ రామకృష్ణ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఖైచర్ల శంకర్రావు, సెక్రటరీ బత్తిన శ్రీనివాసరావు, ఉమాసాయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● ఏలూరుకార్పొరేషన్: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ కార్మిక హక్కుల పరిరక్షణకై బుధవారం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు డి.ఎన్.వి.డి. ప్రసాద్ కోరారు. బుధవారం జరిగే సమ్మెలో కార్మిక వర్గాలు పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. ఉదయం 9.30 గంటలకు పవరుపేట రైల్వేస్టేషన్ నుంచి వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలియజేశారు.

● పోలవరం: కార్మికుల సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ఏపీ రైతు సంఘాలు మద్దతు తెలిపినట్టు ఏపీ రైతుకూలీ సంఘం తెలిపింది. జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ పంటల మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని, రైతుల వ్యవసాయ కార్మికుల కౌలు రైతుల రుణాలు రద్దు చేయాలని, కౌలు రైతుల రక్షణకు చట్టం తీసుకురావాలని కోరారు.



ఉపాధి కూలీలతో ఆదివాసీ సంఘ నాయకులు

ఏజెన్సీ చట్టాల అమలులో విఫలం

బుట్టాయగూడెం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ చట్టాలను అమలు పరచడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, అక్రమ కట్టడాలను కూల్చివేస్తేనే గిరిజనేతరుల వలసలు తగ్గుతాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను తెలిపారు. మంగళవారం కోయ అంకంపాలెంలో ఉపాధి కూలీలతో ఆదివాసీ చట్టాలపై అవగాహన కల్పించారు. శ్రీను మాట్లాడుతూ చట్టాలను పటిష్టంగా అమలు చేయకపోవడంతో గిరిజనులు అన్ని విధాలా నష్టపోతున్నారన్నారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా స్థిర నివాసాలు, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకుని ఆదివాసీలకు ఉపాధి, వ్యాపార, ఉద్యోగ అవకాశాలు లేకుండా చేస్తున్నారరు. ఐటీడీఏ అధికారుల తీరువల్ల చట్టాలు నీరుగారుతున్నాయన్నారు. నాయకులు కుంజా కృష్ణంరాజు, పూసం శ్రీను, తెల్లం శ్రీనివాసరావు, కుర్సం ముక్కమ్మ, తెల్లం మంగమ్మ, మొడియం రాముడు, మోసం కన్నపరాజు, తెల్లం నాగార్జున పాల్గొన్నారు.

దివంగతనేత రాజశేఖర్ రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న తానేటి వనిత

ద్వారకా తిరుమల, జూలై 8(ఆంధ్రజ్యోతి): దివంగత నేత రాజశేఖర్ రెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తలపెట్టి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని మాజీ మంత్రి, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. ద్వారకాతిరుమలలోని ప్రధాన కూడలిలో ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి 76వ జయంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూర్పు గోదావరి జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడు బొండాడ వెంకన్నబాబు, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు అన్సారీ బాషా, గుర్రాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

నాలుగు గ్రామ కమిటీలు ఏకగ్రీవం

టి.నర్సాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నాలుగు టీడీపీ గ్రామ కమిటీలు ఏకగ్రీవమైనట్టు మండల పరిశీలకులు, ఏలూరు పార్లమెంటరీ తెలుగు యువత అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని అప్పలరాజుగూడెం, బండివారిగూడెం, మక్కినవారిగూడెం, మర్రిగూడెం గ్రామ కమిటీలు ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నట్టు తెలిపారు. అప్పలరాజుగూడెం గ్రామ కమిటీ అధ్యక్షులుగా కాటేపల్లి సత్యనారాయణ, కార్యదర్శిగా చల్లా నాగసుబ్బారావు, మక్కినవారిగూడెం ఆలపాటి పాపారావు, కార్యదర్శిగా ఎల్లపు మురళీశంకర్, ఉపాధ్యక్షులుగా తంగెళ్ల ఆంజనేయులు, బండివారిగూడెం గ్రామ కమిటీ అధ్యక్షులుగా వాసిరెడ్డి రామ్మోహనరావు, కార్యదర్శిగా కొలుకులూరి సుబ్బారావు, మర్రిగూడెం గ్రామ కమిటీ అధ్యక్షులుగా కుంజా ఆనందరావు, కార్యదర్శిగా మెచ్చా వెంకటలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.



దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్

మెట్టగూడెంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే

చింతలపూడి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పది రోజుల తానా సభలకు వెళ్లి వచ్చిన ఎమ్మెల్యే రోషన్ కుమార్ మంగళవారం మండలంలో పర్యటించారు. ప్రగడవరం పంచాయతీ మెట్టగూడెంలో ఉపాధి హామీ పథకంలో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే గ్రామంలో గంధం నాగేంద్రబాబు, రవికుమార్‌లను ఆయన పలకరించగా ఒకరు వికలాంగుడు కావడంతో ట్రై సైకిల్ అడగడంతో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక కార్యాలయంలో ఉన్న సమస్యలపై సమీక్షించారు.

విజన్ స్వర్ణాంధ్రపై ఎమ్మెల్యే సమీక్ష

ఉంగుటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరును మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన విజన్ -2047 స్వర్ణాంధ్ర లక్ష్యంగా నియోజకవర్గ స్థాయిలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. సమీక్షలో పాల్గొన్న నోడల్ అధికారి రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురావడానికి ఈ ప్రణాళికలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.సమీక్షలో ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ పాల్గొన్నారు. నారాయణపురం నుంచి తల్లాపురం వెళ్లే దండు వారిపుంత అభివృద్ధిపై ఎమ్మెల్యే చర్చించారు. పుంత రహదారిని పంచాయతీ రాజ్ ఈ.ఈ.వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు.

280 మందికి నేత్ర పరీక్షలు

దెందులూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంగళవారం రవి కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రవి కిరణ్ వైద్య సిబ్బందితో కలిసి 280 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. యాదవ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముమ్మడి బ్రదర్స్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేలు రూపాయలను కళ్ల జోళ్లు, వైద్య శిబిరం నిమిత్తం అందజేశారు. కొవ్వలి, పోతునూరు, దోసపాడుతో పాటు పలు గ్రామాల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు.

దమ్ముచక్రాలతో రోడ్లపైకి రావొద్దు

పెదపాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు పంటపొలాలను దమ్ము చేసే ఇనుము చక్రాలకు కచ్చితంగా పట్టాలు తొడిగిన తర్వాత మాత్రమే రోడ్లపైకి రావాలని పెదపాడు తహసీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. ట్రాక్టరు ఇనుము చక్రాలకు పట్టాలు తొడగకుండా రోడ్లపైకి రావడం వల్ల రోడ్లు ధ్వంసమవుతున్నాయన్నారు. ఈ కారణంగా ప్రతి ఒక్కరూ తమ ట్రాక్టర్ ఇనుము చక్రాలకు పట్టాలను తొడిగి రోడ్లపైకి రావాలని, లేనిచో ప్రభుత్వ నిబంధనల ప్రకారము జరిమానా విధించడం జరుగుతుందని తహశిల్దారు కృష్ణజ్యోతి తెలిపారు.

భీమడోలు సమస్యలపై చర్చ

భీమడోలు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సర్వసభ్య సమావేశాలు దోహదపడతాయని ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. వివిధశాఖల అధికారులు సమావేశానికి హాజరు కాగా ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని ఎంపీడీవో పద్మావతిదేవి పేర్కొన్నారు. అలాగే మండలంలో జరిగిన అభివృద్ధి జరగబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు ఆదివాసీ దినోత్సవం

బుట్టాయగూడెం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన జరిగే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివాసీ పాస్టర్స్ ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీల ఐక్యతను చాటిచెప్పేలా నాయకులు ఏజెన్సీ మండలాల్లో పర్యటిస్తూ గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రచారం చేపట్టారు. ఐక్యవేదిక నాయకులు ఎం.జోషప్, జి.ఫిలిప్, ఎం.కృపానిధి, కె.సియోన్‌కుమార్, ఎం.పీటర్ పాస్టర్లు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్యామ్

లక్ష్మీనారసింహుని సేవలో ఎమ్మెల్యే

ద్వారకాతిరుమల, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఐ.ఎస్.జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన లక్ష్మీనారసింహుని ఆలయాన్ని కర్నూలు జిల్లా పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ.శ్యామ్‌కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి వారి మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకోగా అర్చకులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఏఈవో పి.నటరాజారావు ఆయనకు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు.

మద్ది క్షేత్రంలో జిల్లా అధికారి

జంగారెడ్డిగూడెం, జూలై 7(ఆంధ్రజ్యోతి) మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.ఆలయ అర్చకులు స్వామికి వేకువ జాము నుంచి ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆమెను ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. వివిధ సేవల రూపంలో ఆలయానికి రూ.1,99,207 ఆదాయం సమకూరినట్టు ఈఓ ఆర్.వి.చందన తెలిపారు.



సత్కరిస్తున్న ఆలయ అధికారులు

చాట్రాయి తహసీల్దార్‌గా భద్రూనాయక్

చాట్రాయి, జూలై 8(ఆంధ్రజ్యోతి): చాట్రాయి తహసీల్దార్‌గా భద్రూనాయక్ బాధ్యతలు చేపట్టారు. నూజివీడు తహసీల్దార్‌గా పనిచేస్తున్న భద్రూ నాయక్‌కు చాట్రాయి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్న డీటీ ఈశ్వరరావు ఇదే కార్యాలయంలో అదే పోస్టులో కొనసాగుతారు.

80 శాతం సబ్సిడీపై డ్రోన్ పంపిణీ

కలిదిండి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం సానారుద్రవరంలో 80 శాతం సబ్సిడీపై రైతులకు డ్రోన్‌ను వ్యవసాయాధి కారులు పంపిణీ చేశారు. డ్రోన్ పూర్తి ధర రూ.9.80 లక్షలు కాగా, 20 శాతం రైతులు చెల్లించాలని ఇన్‌చార్జ్ ఏడీఏ జి.వెంకట మణి తెలిపారు. మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

భార్యను వివాహేతర సంబంధానికి ప్రోత్సహిస్తోందన్న అనుమానంతో ఘాతుకం ▸ పరారీలో నిందితుడు


వరలక్ష్మీ దేవి (ఫైల్)

కలిదిండి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి కల్లుగీత కత్తితో మహిళను దారుణంగా హత్య చేశాడు. పోతుమర్రు పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంకు చెందిన కట్టా రామాంజనేయులు తన భార్యను వివాహేతర సంబంధానికి ప్రోత్సహిస్తోందన్న అనుమానంతో అదే గ్రామానికి చెందిన నంగేగడ్డ వరలక్ష్మీ దేవిని (38) మంగళవారం ఇంటి వద్దనే కల్లుగీత కత్తితో మెడపై నరికి హత్య చేశాడు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేయగా, కైకలూరు సీఐ రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు.. పాము కాటుతో మరొకరు..

కైకలూరు మండలంలో ఇద్దరు మహిళల మృతి

కైకలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు మృతి చెందినట్టు కైకలూరు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని పెంచికలమర్రుకు చెందిన జయమంగళ గంగమ్మ(50) సోమవారం ఉదయం ఇంటి వద్ద తీగపై బట్టలు ఆరవేస్తుండగా సమీపాన రేకుల షెడ్డుకు ఉన్న విద్యుత్‌వైర్లు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై డి. రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండలంలోని వరహాపట్నం గ్రామానికి చెందిన కత్తుల కౌశల్య(38) సోమవారం రాత్రి ఇంటిలో నిద్రపోతుండగా పాము కాటుకు గురైంది. భర్త కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్సై వై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రాపౌట్ రహిత జిల్లాగా మార్చాలి



కైకలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండేలా ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె. పంకజ్‌కుమార్ అన్నారు. మంగళవారం కైకలూరు వెలమపేట మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులతో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. అనంతరం కైకలూరు మార్కెట్‌యార్డ్ సెంటర్లో మానవహారం నిర్మించి అవగాహన కల్పించారు. డ్రాప్ అవుట్ రహిత జిల్లాగా మార్చడానికి 18 సంవత్సరాల లోపు పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలన్నారు. అలాగే ఈ నెల 10న మెగా పేరెంట్స్ మీట్‌ను విజయవంతం చేయాలని, అందుకు కావాల్సిన వసతులు కల్పించి ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఈ సమావేశానికి హాజరయ్యేలా ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎంఈవోలు డి. రామారావు, వి శ్రీనివాసరావు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'భోజనం' నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ముదినేపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మె కారణంగా బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎంఈవోలకు మంగళవారం ఆదేశాలు జారీ అయ్యాయి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు సమ్మెలో పాల్గొంటున్నట్టు నోటీసులు ఇచ్చినందున విద్యార్థులకు భోజనం విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ఎంఈవోలు వంటల నిర్వాహకుల వెతుకులాటలో పడ్డారు.

రఘుబాబుకు సన్మానం

ముసునూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల నూతన అధ్యక్షుడు గద్దె రఘు బాబును ముసునూరు ఉపాధి కార్యాలయంలో ఏపీవో రోజ్‌లీల, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు సన్మానించారు. నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబి, ఉపసర్పంచ్ తోట శ్రీనివాసరావు, బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నక్కా యోహాను, టీడీపీ గ్రామ ఉపాధ్యక్షులు కలపాల రాము తదితరులు అభినందించారు.

కౌన్సిల్ సభ్యుడిగా రంగారావు

ఆగిరిపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఆగిరిపల్లి మండలం, ఈదర గ్రామానికి చెందిన జిఆర్‌కె రంగారావు నియమితులయ్యారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి పీవీ సత్యనారాయణ నియామక ఉత్తర్వులను అందజేసినట్లు రంగారావు తెలిపారు. పార్టీకి, ప్రజలకు తన సేవలను అందజేసేందుకు సంసిద్ధుడిగా ఉంటానన్నారు.

వైఎస్‌కు ఘనంగా నివాళులు


నూజివీడు కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులు


నూజివీడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు మంగళవారం నూజివీడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిమి సాగరకుమార్, కాంగ్రెస్ నాయకులు బీడీ రవికుమార్, యార్లగడ్డ ఆంజనేయులు, సోమరాజు, ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

గుట్కా గుట్టలు

గుట్కా విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు

ఏలూరు క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గుట్కా, నిషేధిత ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. 18 ఏళ్లలోపు పిల్లలకు సిగరెట్లు, మత్తుపదార్థాల అమ్మకాలు జరపరాదని ఎవరైనా విక్రయించినట్లు నిర్ధారణైతే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు హెచ్చరించారు. రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, ఈగల్ టీమ్ ఐజీ ఎ.రవికృష్ణ ఉత్తర్వులతో ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాలతో జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్‌డివిజన్ పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 'ఆపరేషన్ సేవ్ క్యాంపస్ జోన్' అనే కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. విద్యా సంస్థలకు 100 మీటర్ల దూరంలో ఉన్న షాపులను తనిఖీలు చేశారు. ఆ షాపులలో ఉన్న సిగరెట్లు, ఖైనీ, గుట్కాలు వంటి వాటిని సీజ్ చేశారు. ఏలూరు సీఆర్ఆర్ కాలేజీ సమీపంలోని ఐదు షాపులను తనిఖీలు చేయగా అక్కడ నిషిద్ధ సిగరెట్లు, మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, టూటౌన్ సీఐ ఎ.అశోక్ కుమార్, త్రీ టౌన్ సీఐ రాంబాబు, ఆర్ఎస్ఐ ఉదయ భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ సూర్యచక్ర పలువురు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర	(100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475





మర్రిబంధం, అక్కిరెడ్డిగూడెం, దొడ్డిపట్లలో టీడీపీ నాయకుల కరపత్రాల పంపిణీ.. ములకలపల్లిలో తల్లికి వందనం బాగుందంటూ విద్యార్థుల తల్లిదండ్రుల ప్రశంసలు

కూటమి పాలనతో బంగారు భవిత

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో టీడీపీ నాయకులు

చాట్రాయి, జూలై 8(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సారథ్యంలోని కూటమి పాలనలో నవ్యాంధ్రకు బంగారు భవిష్యత్తు రానున్నదని నూజివీడు నియోజకవర్గ తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి మందలపు జగదీష్, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ తమ్మిశెట్టి లక్ష్మణరావు అన్నారు. మర్రిబంధంలో మంగళవారం టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గత వైసీపీ పాలనలో అధోగతిపాలైన రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సీఎం శ్రమిస్తున్నారని, ఎన్నికల హామీ మేరకు పెన్షన్ పెంపు, తల్లికి వందనం అమలు అమలు చేశారని, త్వరలో రైతులకు పెట్టుబడి సాయం విడుదల కానున్నదని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నారని నాయకులు ప్రజలకు వివరించారు.

ముసునూరు: పేదల ఆర్థిక స్థితి మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, సర్పంచ్ పులిబక్క లక్ష్మీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం అక్కిరెడ్డిగూడెం, ముసునూరు గ్రామాల్లో సుపరి పాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ కార్యక్ర మం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికి వెళ్లి నాయకులు వివరిస్తూ, సమస్యలను తెలుసుకుని కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రఘుబాబు, సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కుంటుపడిన అభివృద్ధి, సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు పాలనా దక్షతతో సుపరిపాలనను అందిస్తున్నారన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు బర్మా శ్రీనివాస రావు, గార్లపాటి నరసింహారావు, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. మంగళవారం కైకలూరు మండలం దొడ్డిపట్లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. . గత వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజీఎస్ మాల్యాద్రి, మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు, కైకలూరు పట్టణ అధ్యక్షుడు పడమటి వాసు, మాజీ అధ్యక్షుడు ఎండీ జానీ, గ్రామ సర్పంచ్ ఆగోళ్ళ బలేస్వామి, యూనిట్ ఇన్‌చార్జి గొట్టుముక్కల బాపిరాజు, బూత్ ఇన్‌చార్జి జోషి తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనంపై తల్లిదండ్రుల్లో ఆనందం

ముదినేపల్లి: సుపరిపాలనలో తొలి అడుగు ప్రచార కార్యక్రమంలో తల్లికి వందనం పథకంపై మంచి స్పందన కనిపిస్తున్నది. మండలంలోని కొరగుంటపాలెం, ములకలపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తల్లికి వందనం పథకం వల్ల తమకు కలిగిన ప్రయోజనాన్ని వివరించి సంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కొడాలి వినోద్‌పై గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో పలువురు విద్యార్థులను, తల్లిదండ్రులను తల్లికి వందనంపై ఆరా తీయగా ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంత మందికి ఈ పథకం లబ్ధి అందటం చాలా ప్రయోజనం కలిగించిందని పలువురు తెలిపారు. తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి బొప్పన సుందర రామయ్య, పార్టీ నాయకులు సుంకర రామకృష్ణ, ముచ్చు నాగ ప్రదీప్, నాయుడు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

పేదల పక్షాన భూ ఉద్యమాలు

మండవల్లి జూలై 8(ఆంధ్రజ్యోతి): భూములు, ఇళ్ళస్థలాల సమస్యలపై భూ ఉద్యమాలు సమరశీలంగా సాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ. రవి పిలుపునిచ్చారు. మంగళవారం సింగనపూడిలో ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రా జగదీష్ అధ్యక్షతన సీపీఎం ఆధ్వర్యంలో భూ సదస్సు నిర్వహించారు. రవి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పేదలకు దక్కాల్సిన భూములు వారికి అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె శ్రీనివాస్ మాట్లాడుతూ పేదల భూ సమస్యలు పరిష్కరించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ కార్యదర్శి ఉచ్చుల సుధీర్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

'ట్రిపుల్ ఐటీలో వాజపేయి విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వండి'

నూజివీడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఆర్జీయూకేటీలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహం ఏర్పాటుకు అనుమతినివ్వాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ కోరారు. ఈ మేరకు దేవానంద్ మంగళవారం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమర్నాథ్ కుమార్‌ని నూజివీడులోని ఆయన కార్యాలయంలో కలసి డిసెంబరు 25 వాజపేయి జయంతి సందర్భంగా ఆయన విగ్రహం ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఆయనతో పాటు జిల్లా బీజేపీ నాయకులు ఎం. రాజశేఖర్, నూజివీడు పట్టణ ప్రధాన కార్యదర్శులు ధనాల రవికిషోర్, దోసపాటి మల్లికార్జున జగదీష్, కార్యదర్శి సూర్యప్రకాష్‌కుమార్, పవన్, సాయి, తదితరులు పాల్గొన్నారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అమ్మ పేరుతో మొక్కను దేవానంద్ నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ వ్యక్తి తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని ఆయన కోరారు.

గుట్కా విక్రయిస్తే కఠిన చర్యలు

ఆగిరిపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల సమీపంలోని దుకాణాదారులు పాన్ పరాగ్, గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆగిరిపల్లిలోని పలు పాఠశాలల వద్ద గల దుకాణాలను జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు తనిఖీ చేపట్టారు. అనంతరం ఆగిరిపల్లి జూనియర్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్, సోషల్ మీడియా వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ శుభశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హైస్పీడ్ హైవే..

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై దూసుకుపోనున్న వాహనాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఖమ్మం-దేవరపల్లి నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు ఒక కొలిక్కి వచ్చాయి. సుమారుగా 162 కిలోమీటర్లకు పైగా యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే ఇది. ఒకప్పుడున్న మార్గాన్ని పూర్తిగా మార్చి సకల సౌకర్యాలతో వేగవంతంగా ప్రయాణించేలా తీర్చిదిద్దారు. సుమారు రూ. 4 వేల కోట్లకు పైగా ఇప్పటికే ఖర్చు అయ్యింది. ఈ మార్గంలో 31 గ్రామాల్లో రెండు వేల ఎకరాలను కేంద్ర ప్రభుత్వమే సేకరించి హైవే విస్తరణకు దిగింది. హైదరాబాదు నుంచి విశాఖ వెళ్లాలంటే విజయవాడ మీదుగా 676 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వచ్చేది. గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తయితే విజయవాడ వెళ్లకుండా సమయం కలిసి రావడమే కాకుండా సుమారు 125 కిలోమీటర్ల మేర ప్రయాణ భారం తగ్గనుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ హైవేలో పాత పద్ధతు లకు పూర్తిగా స్వస్తి చెప్పారు. సుమారు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు ఈ హైవేలో ప్రయాణిం చేలా చర్యలు తీసు కుంటున్నారు. అందు కనే ఇక ముందు ఈ రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు వంటివి పూర్తిగా అనుమ తించరు. కేవలం కార్లు, బస్సులు, లారీలు, భారీ వాహనాలకు మాత్రమే అనుమతి. ఈ మార్గం మీదుగా ఇప్పటికే విశాఖ పోర్టుకు చేరేందుకు భారీ సరుకు వాహనాలు రోజూ పెద్ద సంఖ్యలో తరలి వెళ్లేవి. ఈ కారణంగా జీలుగుమిల్లి నుంచి దేవరపల్లి వరకు ఇంతకుముందున్న పాత మార్గం ఛిద్రమైంది. దీంతో ఆ మార్గంలో వెళ్లాలంటేనే అందరూ భీతిల్లిపోయేవారు. ఆఖరుకి ఆటోలు తిరగలేని దుస్థితి. గ్రీన్‌ఫీల్డ్ హైవేను ఇప్పుడు అద్భుతంగా తీర్చిదిద్దారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో మొదలై ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో ఈ హైవే ముగుస్తుంది.

డిజిటల్ హైవేకు ఆస్కారం

ఈ హైవే ప్రారంభించడానికి మరికొద్ది రోజులు సమయం పడుతున్నందున తాజా ప్రతిపాదనలను అమలులోకి తెచ్చే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ జిల్లాలో తొలిసారిగా డిజిటల్ హైవేకు ఆస్కారం ఏర్పడినట్టే. ఈ హైవే యావత్తు ఖమ్మం జిల్లాలో ప్రారంభమై ఏలూరు జిల్లా చింతలపూడి మండలం సరి హద్దున ఉన్న లింగగూడెంలో మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి రేచర్ల మీదుగా టి.నర్సాపురం, ఏపిగుంట, జంగా రెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలం రాజవరం, యర్రం పేట మీదుగా దేవరపల్లి మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారిలో కలుస్తుంది. ఇప్పటివరకు ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ హైవేపైకి వెళ్లాలంటే రేచర్ల, గురవాయిగూడెం, దేవరపల్లిలలో మాత్రమే అనువైన ఏర్పాట్లు చేస్తున్నారు.

వరద హెచ్చరిక

(5వ పేజీ తరువాయి)

విభిన్న ప్రతిభావంతులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణులను దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

రక్షణ చర్యలు ఇలా..

కోయిదా పరిసర గ్రామాల కొండ ప్రాంతాల ప్రజలకు టార్పాలిన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. గోదావరి తీర ప్రాంతంలో ముంపు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రమాద హెచ్చరికలు జారీ చేసిన వెంటనే ఆ ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అనువైన ప్రదేశాలను ముందుగానే గుర్తించి తాత్కాలిక షెడ్లు, తాగునీరు, టాయిలెట్లు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పాడిపశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించి దాణా, నీరందించే చర్యలు తీసుకోవాలని పశుసంవర్థక శాఖాధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, బ్రిడ్జిలు, కల్వర్టులు, కాజ్‌వేలను గుర్తించి ముందుగానే మరమ్మతులు చేయించాలని ఆర్‌అండ్‌బీ శాఖను ఆదేశించారు. గత వరదల సమయంలో గండ్లు పడిన ప్రదేశాలను పరిశీలించి అవసరమైన చోట పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలని గతంలో జరిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని అటు వంటివి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకో వాలని నీటిపారుదల శాఖ అధికారు లను ఆదేశించారు. తుఫాన్లు, వరదల సమయంలో విద్యుత్ స్తంబాల వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, సమాచార వ్యవస్థ పని చేసే విధంగా సెల్ టవర్లు జనరేటర్లు ఏర్పాటు చేయాలని, సోలార్‌లైట్లు సిద్ధంగా ఉంచుకోవాలని విద్యుత్‌శాఖాధికారులను కలె క్టర్ ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తాగు నీరు కలుషితం కాకుండా ప్రస్తుత తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, తాగునీటి పైపులైన్లు, డ్రెయినేజీ పైపులైన్లు కలవకుండా చూడాలని, మరమ్మ తులకు గురైన చేతి పంపులను వెంటనే మరమ్మతు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత గ్రామల్లో అత్యవసర సమ యంలో పంపిణీ చేసేందుకు 3నెలలకు సరిపడ నిత్యవసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర సమయాల్లో ప్రజలను తరలించేందుకు వీలుగా పెద్దసంఖ్యలో బోట్లు సిద్ధం చేసుకోవాలని మత్స్యశాఖాధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, ఆర్డీవో రమణ, డీఆర్‌డీఏ పీడీ కే.విజయరాజు, ఇరిగేషన్ ఎస్‌ఈ నాగార్జునరావు, ఏపీవో అనురాధ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ త్రినాధబాబు, వ్యవసాయ శాఖ జేసీ హబీబ్ బాషా, ట్రాన్స్‌కో ఎస్‌ఈ సాల్మన్‌రాజు, గృహనిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ, పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో శ్రీహరి, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

20 ఏళ్ల క్రితం అదృశ్యమై.. కనిపించాడు



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో బెడ్‌పై ఉన్న సుబ్బారావు

ఏలూరు క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు ఆరో వార్డులో నివాసం ఉండే కలగర సుబ్బారావుకు భార్య ప్రభావతి, కుమారుడు, కుమార్తె ఉండేవారు. సుబ్బారావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ తాగుడికి బానిస అయ్యాడు. భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో అతడు, భార్య, పిల్లలను వదిలివేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మద్యం తాగుతూ చివరకు లారీ డ్రైవింగ్ కూడా మానివేసి రైళ్లలో భిక్షాటన చేస్తూ, రైల్వే స్టేషన్‌లో పడుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం నిడదవోలు నుంచి భీమవరం వెళ్లే ప్యాసింజర్ రైలులో భిక్షాటన చేస్తూ ప్రమాదవశాత్తు కాల్దారి గ్రామ సమీపంలో రైలు నుంచి జారిపడ్డాడు. అతని ఉదరభాగం కింద ఒక ఎముక విరిగినట్లు వైద్యులు గుర్తించారు. అతడిని 108లో తణుకు ఆసుపత్రిలో తీసుకువెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం మంగళవారం రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అతడి బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు అతడి వద్దకు రావడానికి నిరాకరిస్తున్నారు.

భార్యా పిల్లలను చూడాలని ఉంది..

సుబ్బారావు లేవలేని పరిస్థితిలో బెడ్‌పై ఉండి అతడి మలమూత్రాలను వస్త్రాల్లోనే చేసేసుకోవడంతో ఆసుపత్రి సిబ్బంది సపర్యలు చేస్తున్నారు. తన కుటుంబ సభ్యులను తన భార్య, తన పిల్లలు ఎక్కడ ఉన్నారో ఒక్కసారి చూడాలని ఉందని, చేసిన తప్పులకు పశ్చాత్తాపడుతున్నానని రోదిస్తూ కనిపించిన వారికి దండంపెడుతూ బతిమాలుతున్నాడు. విరిగిన ఎముక భాగానికి ఆపరేషన్ అవసరం లేదని బెల్టు కట్టుకోవడం, మందులు వాడడం వల్ల మూడు, నాలుగు వారాల్లో తగ్గిపోతుందని వైద్యులు చెబుతున్నారు. అప్పటివరకు అతడికి సహాయంగా ఎవరు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది.

రైతుల ఆర్థికాభివృద్ధికే పండ్ల మొక్కల పంపిణీ


ఓగిరాల తండాలో ఉపాధి పథకం కింద పామాయిల్ మొక్కలు నాటుతున్న దృశ్యం

ముసునూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధి కోసం పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్(బాబి) అన్నారు. ముసునూరులో రైతు తలకొండ శ్రీనివాసరావుకు ఉపాధి పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి అందించిన నిమ్మ మొక్కలను ఏపీవో రోజ్ లీల, నాయకులతో కలిసి మొక్కలను నాటగా, వలసపల్లిలో సర్పంచ్ చలసాని దామోదరరావు, ఎంపీడీవో సత్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర కొబ్బరి మొక్కలను నాటి ఈ పథకాన్ని ప్రారంభించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు గార్లపాటి నరసింహారావు, నాయకులు తోట శ్రీనివాసరావు, నక్కా యోహాను, తులిమెల్లి రంగారావు, ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నూజివీడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల్లో పండ్ల తోటలు, పామాయిల్ మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నూజివీడు మండలం ఓగిరాల తండాలో నూజివీడు మండల టీడీపీ అధ్యక్షుడు యనమదల శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిలో ఈ పథకం ఒక అద్భుతమైన ముందడుగన్నారు. నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష, మండల ఎన్డీ నాయకులు, ఉపాధి హామీ ఏపీవో రోజ్‌లీల, ఇతర ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.

చాట్రాయి: సూరంపాలెంలో రైతు గుడిమళ్ళ వసంతరావుకు ఉపాధి హామీ పథకం కింద పండ్ల మొక్కల పెంపకానికి నిధులు మంజూరు అయ్యాయి. సదరు రైతు తోటలో మంగళవారం మండల టీడీపీ నాయకుడు నక్కా రాము, జనసేన మండల ప్రధాన కార్యదర్శి మొండ్రు సురేష్ మామిడి మొక్కలు నాటారు. ఎఫ్ఏ కొండా ప్రసాద్, స్థానిక నాయకులు దార్ల సురేష్‌కుమార్, పెద్ద నాగేశ్వరరావు, రమేష్‌బాబు, భాస్కరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు సహకార సంఘాల బంద్

ముదినేపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెలో భాగంగా తమ డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ సహకార బ్యాంకులు, సంఘాల ఉద్యోగులు బుధవారం విధులను బహిష్కరించనున్నట్లు ఏపీ పీఏసీఎస్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్, ఏలూరు జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు పల్లెం శ్రీనివాసరావు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, సహకార బ్యాంకు బ్రాంచీలు బంద్ అవుతాయని, అన్ని సంఘాలు, బ్రాంచి కార్యాలయాల వద్ద ఉద్యోగులు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తారని తెలిపారు. ఉద్యోగులను కట్టు బానిసలుగా మార్చే కార్మిక కోడ్లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, కార్మికుల హక్కులను కాపాడాలని రఘురాం డిమాండ్ చేశారు.

11న ఏఐఎస్ఎఫ్ ధర్నా

నూజివీడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని అలాగే జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 11న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షుడు శివకుమార్, నూజివీడు నియోజకవర్గం అధ్యక్షుడు సంపత్ తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం నూజివీడులో పలు కళాశాలల విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేసి ధర్నా విజయవంతం చేయాలని కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

మండవల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మండవల్లిలోని ఎమ్మార్సీ కేంద్రం వద్ద మంగళవారం భోజన విరామ సమయంలో సమగ్ర శిక్ష సిబ్బంది నిరసన తెలిపారు. ఎంటీఎస్, హెచ్ఆర్ పాలసీ, ఒప్పందాలు అమలు చేయాలని, పనిభారం తగ్గించి, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఈపీఎఫ్, హెల్త్ కార్డులు, మెడికల్ లీవులు ఇవ్వాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని జేఏసీ నాయకుడు జిల్లా కోశాధికారి భగవాన్ డిమాండ్ చేశారు. కంప్యూటర్ ఆపరేటర్ వెంకటరత్నం, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కనకదుర్గమ్మ పాల్గొన్నారు.

మెగా పీటీఎంకు ఏర్పాట్లు

ముదినేపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న మండలంలోని 67 ప్రభుత్వ, 8 ప్రైవేట్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశాలను నిర్వహించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఏకరూప దుస్తులతో హాజరయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని సుమారు 9 వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఈ సమావేశాలను నిర్వహించేందుకు ఎంఈవో-1 డి.రామారావు, ఎంఈవో-2 నరేష్ కుమార్ ఆధ్వర్యంలో పాఠశాలల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.

ముసునూరు: మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాల్లో మెగా పేరెంట్స్ మీట్‌ను విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారులు టి.రామ్మూర్తి, బీవీఎస్ సుబ్బారావు అన్నారు. మంగళవారం ముసునూరులో ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఎస్ఎంసీ కమిటీల సభ్యులను ఆహ్వానించి, ఈ ప్రోగ్రాంకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రగతి నివేదికలు, సాంస్కృతిక, క్రీడా కార్యాక్రమాలను నిర్వహణ జరగాలన్నారు. తల్లులకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, తండ్రులకు టగ్-ఆఫ్-వార్ పోటీలను నిర్వహించాలని సూచించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి, హెచ్ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ

ముదినేపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సింగారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీడీపీ నాయకులు నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొర్రా చలమయ్య సహకారంతో మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, పార్టీ నాయకులు కోడూరు శేషుబాబు, బొంగు రవికుమార్ విద్యార్థులకు అందజేశారు. సంకర్షణపురం సర్పంచ్ నాగరాజు, పెనుమల్లి సర్పంచ్ వెంకటేశ్వరరావు, మండల పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మజీద్ హుస్సేన్, హెచ్ఎం సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గురు పౌర్ణమి వేడుకలు ప్రారంభం

ముసునూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిగూడెంలోని శిర్డిసాయిబాబా ఆలయంలో మంగళవారం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు దీపక్ పాండ్యా ఆధ్వర్యంలో బాబా ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు నిర్వహించారు. 10న గురుపౌర్ణమినాడు అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పోలవరపు నరసింహారావు తెలిపారు.